AL - HILAL

నెలవంక

కూని పత్రిక



Vol 7, Issue: 51 January - 2011 مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى

లోక శాంతి



అల్లాహ్ దైవ దూతలకు బుద్ధివివేకాలిచ్చాడు, కామవాంఛలను ఇవ్వలేదు. జంతువులకు కామవాంఛలు మాత్రమే ఇచ్చాడు, బుద్ధివివేకాలను ఇవ్వలేదు. కాగా; ఆదం పుత్రుడైన మనిషికి బుద్ధి వివేకాలతోపాటు కామవాంఛలను కూడా ప్రసాదించాడు. కామవాంఛలను అదుపులో పెట్టుకుని వివేకవంతునిగా మసలినవాడు దైవ దూతల సరసన నిలుస్తాడు. కామాంధుడై వివేచనను కోల్పోయినవాడు జంతుజాలంలో చేరిపోతాడు.

IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

"సత్కార్యం అంటే మీ ముఖాలను తూర్పుకో పడమరకో తిప్పుకోవడమే కాదు. సత్కార్యం అంటే అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని, దైవ దూతలను, దైవ గ్రంథాన్ని, ఆయన ప్రవక్తలను హృదయపూర్వకంగా విశ్వసించి, అల్లాహ్ మీద ప్రేమతో మీకత్యంత ప్రియమైన ధనాన్ని సమీప బంధువుల కోసం, అనాథల కోసం, నిరుపేదల కోసం. బాటసారుల కోసం, సహాయార్థుల కోసం, బానిసల విముక్తి కోసం ఖర్చు చేయాలి. (దాంతోపాటు) ప్రార్థనా వ్యవస్థను నెలకొల్పాలి, జకాతు చెల్లించాలి, చేసిన ప్రమాణాన్ని నెరవేర్చాలి, కష్ట కాలంలో, విషమయ పరిస్థితిలో, అకస్మాత్తుగా ఆపదలు విరుచుకుపడినప్పుడు సహనం వహించాలి. ఇలాంటి సత్క్రియలు చేసేవారే సత్యవంతులు. వారే దైవం పట్ల నిజమైన భీతి గలవారు." (దివ్య ఖుర్‌ఆన్- 2: 177)



సామాజిక, సాంస్కృతిక, సందేశాత్మక మాస పత్రిక

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 7, ISSUE: 51
January 2011

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

EDITORIAL BOARD
Sk. Habeebur Rahman Jamaee
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal

مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....

సుహృద్భావం సామరస్యానికి పునాది 2
ఓ మనిషీ! నిన్ను నీవు తెలుసుకో 3
సత్యం వచించు..ధర్మం ఆచరించు.. 4
పశ్చాత్తాపం 6
రాష్ట్రానికి రానున్నవి గడ్డు రోజులేనా? 7
ఖుర్‌ఆన్ వెలుగులో యేసు (ఈసా) 8
విలక్షణ శిక్షణ విశ్వనాయకులవారిది 10
న్యాయం కోసం నిలబడండి 11
ఇస్లాం శిక్షణ 12
కవితా కుసుమాలు 13
ప్రవక్త అయ్యూబ్ (అ) - 2 14
ఐపిసి వార్తలు 16
షిర్క్ పుట్టు పూర్వోత్తరాలు 18
నేటి బాలలే రేపటి పౌరులు - 9 19



كلمة العدد (بمناسبة يوم الاستقلال) ◄ اعرف نفسك ◄ الحل الوحيد للوحدة الإنسانية ◄ التوبة
المستقبل لولاية آندهرا برديش ◄ عيسى ابن مريم (عليه السلام) في القرآن ◄ أساليب تربية
النبوية ◄ أعدلوا هو أقرب للتقوى ◄ خذ عقيدتك من الكتاب والسنة ◄ نشيد ◄ نبي الله
أيوب عليه السلام ◄ أخبار اللجنة ◄ الشرك في ميزان العدل ◄ روضة الأطفال

సుహృద్భావం సామరస్యానికి పునాది

ప్రజలు సహజంగా శాంతికాముకులు. వారు శాంతిని, మనశ్శాంతిని, ద్వేషరహిత, అణ్వస్త్ర రహిత శాంతినే కోరుకుంటారు. అందుకే శాంతి అనేది మనుజ జాతి మనుగడతో ముడిపడి ఉన్న అవిభాజ్యాంశం అయింది నాటి నుంటి నేటి వరకు. తగాదాలను చిలికి, చిలికి గాలి వానగా చేసుకొని పరస్పర విధ్వంసానికి దారి తీసే పశు ప్రవృత్తిని శాంత స్వభావులు ఎవ్వరూ ఇష్టపడరు. కాబట్టి సుహృద్భావాన్ని పెంపొందించి సామరస్యాన్ని సాధించుకునే దిశగా మనిషి పురోగమించాలి.

నిఖిల జగత్తు నిర్వహణకర్త పోలిక, సాటి, సమానులు లేని ఆ సర్వేశ్వరుడైన అల్లాహ్ సెలవిచ్చినట్లు **"వ జఅల్నాకుమ్ షుఊబవ్ వ ఖబాయిల లి తఆరఫూ"** – ఒక ప్రాంత సంస్కృతి, ఆచార వ్యవహారాలు, జీవన సరళి, శైలిని మరో ప్రాంత ప్రజలు చారిత్రక, సామాజిక, నైతిక నేపథ్యంలో తమ దృక్కోణం నుంచి కాక, వారి దృక్పథం ద్వారా అర్థం చేసుకోవాల్సిన ఆవశ్యకత నేడు ఎంతైనా ఉంది.

భాష బలమైన సంధానకర్త, భావప్రకటన ఆయువు వంటిది. కాబట్టి ఆయా రాష్ట్రాలలో కనీసం ప్రభుత్వామోదం పొందిన భాషల్ని నేర్చుకోవడం ఎంతైనా అవసరం. ఎందుకంటే వందల సంవత్సరాలు ప్రక్క ప్రక్కనే నివసిస్తూ ఒకరు ఇంకొకరి భాషను మాట్లాడకపోవడం అనేది వారు అనుకోకుండానే వేర్పాటు ధోరణికి అంకురార్పణం కాగలదన్న వాస్తవాన్ని గ్రహించాలి.

ఏ సమాజ పురోగమనంలోనైనా, తిరోగమనంలోనైనా యువకుల పాత్ర విస్మరించరానిది. కాబట్టి వారి పాఠ్య పుస్తకాలలో మతతత్వ ప్రచారంగాని, మత వ్యతిరేక ప్రచారంగానీ ఉండకూడదు. అన్ని మతాలకు సంబంధించిన వారి పిల్లలు ఉన్న పాఠశాలలో కేవలం ఒక మత బోధ జరిపితే, కొందరిని ప్రోత్సహించి, కొందరిలో అసంతృప్త జ్వాలలను రగిలించిన వారమవుతాము. అలాగే, నగరాల్లో, పట్టణాల్లో, పల్లెల్లో అన్ని వర్గాల యువకులను తరచూ కలిపే క్రీడా కార్యక్రమాలు విస్తృతంగా జరగాలి. ఒక మతస్తులు ఒక చోట, వేరొక మతస్తులు మరొక చోట ఆడుకునే దోష సంస్కృతి పోవాలి. గత 60 ఏండ్లలో వచ్చిన వేర్పాటు ధోరణిని అధిగమించి మతంతో, జాతితో, వృత్తితో, హోదా అంతస్థులతో నిమిత్తం లేని రీతిలో అందరూ ఒకే చోట ఆటపాటల్లో పాల్గొనటం నేటి ముఖ్యావసరంగా గుర్తించాలి. అన్ని మతాలలోని శాశ్వత మానవ విలువలైన – సత్యనిష్ఠ, ధర్మ నిరతి, దైవభక్తి, దయ, కరుణ, పరోపకారం. సానుభూతి, త్యాగం, ఔదార్యం వంటి సద్గుణాలను వెలికి తీసి, వాటిని ప్రధానాంశాలుగా భావించేటట్లు భావితరాలను తీర్చి దిద్దాలి.

చారిత్రక, వాణిజ్య, వ్యావసాయిక కారణాల వల్ల ఒక ప్రాంతంలో ఒక మతస్తులు, మరో ప్రాంతంలో వేరొక మతస్తులు సంఖ్యాధిక్యత కలిగి ఉండవచ్చు. దాంతో అల్పసంఖ్యాకులైన సోదరులకు (వారు ఏ మతస్తులైనా) తాము అల్ప సంఖ్యాకులుగానే మిగిలిపోతామేమోననే భయం కలగటం సహజం. అయితే ఈ మానసిక దౌర్బల్యాన్ని అధిగమించడం అవసరం. ఎందుకంటే అలా భయపడినవాళ్లు జనజీవన స్రవంతిలో కలిసిపోలేరు. మేము వేరు, వారు వేరు కనుక మేము ఎవరితోనూ కలిసేది లేదని అధిక సంఖ్యాకులు భావించినా, అల్ప సంఖ్యాకులు తలపోసినా – రెండూ ప్రమాదకర ధోరణులే.

ఈ నిమిత్తం పిల్లల్లో సుహృద్భావాన్ని, సహిష్ణుతను, సోదరభావాన్ని, సమానత్వ భావనను, స్వేచ్ఛా పిపాసను నూరిపోయడం అవసరం. అలాగే పొరపాటు వైఖరిని అవలంబించే పెద్దలను, వైషమ్యాన్ని చిలికించే శాంతి విఘాతకులను సన్మార్గానికి మళ్ళించాల్సిన గురుతర బాధ్యత అన్ని మతస్తుల వారిపై ఉంటుంది. **'అల్ ఫిత్నతు అషద్దు మినల్ ఖత్ల్'** – కల్లోలం సృష్టించటం, అలజడి రేకెత్తించటం హత్యకన్నా దారుణం అన్న యదార్థాన్ని అందరూ సమానంగా గుర్తించాలి. **'అన్యాయంగా ఒక ప్రాణిని బలిగొంటే సమస్త మానవాళిని బలిగొన్నట్లు. ఒక ప్రాణిని కాపాడితే సమస్త మానవాళిని కాపాడినట్లు'** అన్న ఆ సర్వేశ్వరుని శాసనానికి అందరూ తలొగ్గి జీవించాలి. గణతంత్ర దినోత్సవ శుభ సందర్భంగా ఈ బృహత్తర కార్య సిద్ధికి అందరూ చిత్తశుద్ధితో పూనుకుంటారని ఆశించటం అత్యాశ కాదేమో!!

సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ



ఓ మనిషీ! నిన్ను నువ్వు తెలుసుకో

- మౌలానా వహీదుద్దీన్ ఖాన్

ఈ మీ జీవితం అత్యంత సుదీర్ఘమైనది, నిరంతరాయమైనది. మరణం ఈ జీవితానికి ఆఖరి అంచు కాదు. పైగా అది మరో యుగానికి – నవ యుగానికి నాంది. మరో మాటలో చెప్పాలంటే మృత్యువు జీవిత దశల మధ్య ఒక విభజన రేఖ వంటిది. ఉదాహరణకు ఒక రైతు చేనులో నారు వేస్తాడు. నీరు పెడతాడు. పంట కోసం పెట్టుబడి పెడతాడు. అది పండే వరకూ శ్రమిస్తాడు. పంట పండిన తర్వాత కోత కోస్తాడు. ఎందుకు? పంటను నూర్చి ఏడాది వరకూ తనకు కావలసిన ఆహారధాన్యాన్ని సమకూర్చుకునేందుకు! పంట కోతకు వచ్చిందంటే, దాని అర్థం ఒక దశ ముగిసింది. రెండవ దశకు లేక రెండవ యుగానికి ఆ కోత నాంది అయింది. అంతకు ముందు నారు వేయటం, పంటను తయారు చేయటం, కోత కోయటం–ఇదంతా ఏమిటి? తన అవసరాన్ని తీర్చుకోవడానికి చేసే నిరంతర సాధన. పంట ముందు వరకూ కేవలం శ్రమ తప్ప, ధన వ్యయం తప్ప మరేదీ అతనికి లభించలేదు. అయితే పంట కోసిన తరువాత ఆ రైతు తన శ్రమకు తగ్గ ఫలితం పొందాడు. తాను పెట్టిన పెట్టుబడికి తగ్గ లాభాన్ని – దిగుబడిని – ఆర్జించాడు.

మన జీవన పరిస్థితి కూడా సరిగ్గా ఇంతే. మనం ఈ ప్రపంచంలో పరలోకం యొక్క పంటను తయారు చేస్తున్నాము. మనలో ప్రతి ఒక్కడూ పరలోకంలో తన కంటూ ఒక పంట పొలాన్ని కలిగి ఉన్నాడు. ఆ పంటపొలాన్ని అతను సేద్యం అన్నా చేస్తున్నాడు లేదంటే బంజరుగానైనా వదలి పెడుతున్నాడు. ఆ చేనులో అతను మేలు జాతి విత్తనాలయినా చల్లాడు లేదంటే నాసిరకం విత్తులయినా వేశాడు. విత్తనాలు వేసిన మీదట పొలాన్ని గాలికి వదిలేయడమైనా చేశాడు లేదా విత్తనాలు చల్లిన క్షణం నుంచి దాన్ని కంటికి రెప్పలా కాపలా కాయటమైనా చేశాడు. అతను నాటితే ముళ్ళ మొక్కలయినా నాటాడు లేదా మంచి మంచి పూలు పండ్లయినా పండించాడు. అతను తన శక్తియుక్తులన్నింటినీ పంట చేను మెరుగు కోసం ధారబోయడమైనా చేశాడు లేదా పొలాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా ఇతరత్రా వ్యాపకాల్లోనయినా నిమగ్నుడయ్యాడు. చావు దాపురించే దాకా ఆ పంట తయారవదు. చావు వచ్చిందంటే పరలోక పంట పొలం కోతకు వచ్చిందన్న మాటే! ఈ ప్రపంచంలో మన కన్ను మూత బడిందంటే మరో ప్రపంచంలో మన కన్ను తెరుచుకుందన్న మాట! జీవితమంతా శ్రమించి సిద్ధం చేసిన పంట చేను అక్కడ మన ముందు ప్రత్యక్ష మవుతుంది.

గుర్తుంచుకోండి – సాగు చేసిన రైతు మాత్రమే కోత కోస్తాడు. ఏ విత్తనాన్ని వేసుకుంటాడో దాని పంటనే కోస్తాడు. అలాగే ప్రతి వ్యక్తికీ ఈ లోకంలో అతను మరణానికి ముందు చేసుకున్న దాని ప్రతిఫలమే లభిస్తుంది. రైతుకు వ్యవసాయోత్పత్తుల అంచనా ఉంటుంది. తాను పెట్టిన పెట్టుబడిని బట్టి, పడిన శ్రమను బట్టి అతనికి ఇంచుమించు ఎన్ని బస్తాల ధాన్యం ఇంటికి వస్తుందో లెక్క ఉంటుంది. అదే విధంగా మనిషి ఈ ప్రపంచంలో ఏ మేరకు పాటుపడతాడో ఆ మేరకే పరలోకంలో అతనికి ప్రాప్తమవుతుంది. దేని కోసం ప్రయత్నించాడో అదే లభిస్తుంది. కష్టార్జితాన్ని పొందే స్థలం పరలోకం. మరణం తరువాత మళ్ళీ కష్టపడే అవకాశం ఉండదు. అలాగే పరలోకానికి ఒక పరిమితి అంటూ ఉండదు. అది అనంతమైనది, శాశ్వతంగా ఉంటుంది.

ఎంత సున్నితమైన విషయమిది! మరణానికి ముందే మానవుడు ఈ యదార్థాన్ని గ్రహిస్తే ఎంత బావుండు!! ఇలా ఎందుకు అనవలసి వస్తుందంటే మరణించిన తరువాత అతను యదార్థాన్ని అర్థం చేసుకుని ప్రయోజనమేమీ ఉండదు. చనిపోయిన తరువాత యదార్థాన్ని గ్రహించాడంటే గత కాలంలో తన వల్ల జరిగిపోయిన పొరబాటుపై విచారిస్తున్నాడన్న మాట. కాని అది ఎటువంటి పొరబాటంటే ఇప్పుడది ఏ విధంగానూ సరిదిద్దబడదు.

మానవుడు తన పర్యవసానం పట్ల ఏమరుపాటుకు, అజాగ్రత్తకు లోనై ఉన్నాడు. కాని నిజం ఏమిటంటే కాలం అతన్ని అత్యంత శీఘ్రంగా కోతకోసే స్థలానికి లాక్కు పోతోంది. మరి ఇతనేమో ప్రాపంచిక అల్ప వస్తువుల కోసం అర్రులు చాస్తున్నాడు. పైగా తనేదో గొప్పగా పాటు పడుతున్నట్లు భావిస్తున్నాడు. ఘనకార్యం చేస్తున్నట్లు ఊహించుకుని, ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బవుతున్నాడు. యదార్థానికి అతను, తన సమయాన్ని వృధా చేస్తున్నాడు. అతని ముందు ఒక మహదావకాశం ఉంది. దాన్ని సద్వినియోగం చేసుకోవటం ద్వారా తన కోసం ఉజ్వలమైన భవిష్యత్తును తయారు చేసుకోగలడు. కాని అతనేమో నిశ్చింతగా ఉన్నాడు. అనంతమయిన సుఖాలకు, అపూర్వ ఆదరణకు నిలయమైన స్వర్గం వైపునకు అతని ప్రభువు అతన్ని పిలుస్తున్నాడు. కాని అతనేమో మూన్నాళ్ళ ముచ్చటలో, విషయలాలసలో మునిగి తేలుతున్నాడు. తానేదో సంపాదిస్తున్నానని అతను తలపోస్తున్నాడు. కాని వాస్తవానికి అతను జారవిడుస్తున్నాడు. ప్రపంచంలో ఇల్లు కట్టి జీవితాన్ని నిర్మించుకున్నానని అతను భావిస్తున్నాడు. అది నిర్మితమయ్యేది ఏదో ఒకనాడు కూలిపోవడానికే.

ఓ మనిషీ! నిన్ను నువ్వు తెలుసుకో. నువ్వు చేయవలసిన దేమిటి? చేస్తున్నదేమిటి?

సత్యం వదించు... ధర్మం ఆచరించు... శాంతి లభించు...!



ప్రాణి కోటి అంతటిలోనూ మానవుని జన్మ విశిష్టమయినది. మానవత్వంతో మెలగడం అంతకంటే విశిష్టమైనది. దేవుడు జీవుడికి పంచేంద్రియాలూ, నవ నాడులూ, ప్రతిభాపాటవాలూ ఇచ్చింది సృజనశీలుడైన ఆ సర్వేశ్వరుడ్ని గుర్తించడానికి, సాటి మనిషితో కరుణతో మెలగడానికి - ఆ విధంగా జీవితాన్ని చరితార్థం చేసుకోవడానికే. కానీ కండ కావరంతో కామాంధుడై, పొగరుబోతై, కూర్మిష్టి, కర్మిష్టి కాలేక నరుడు నరకానికి పోతున్నాడు. దేవుడు నరుణ్ణి నిఖిల సృష్టిలో ప్రవరఁడిగా సృష్టిస్తే-, ధీరోదాత్తుడైన ప్రవరుఁనిగా వ్యవహరించకపోగా, పశు ప్రవృత్తి కలిగి సాటి జనుల మాన, అభిమాన ధనాలు కొల్లగొట్టి దైవ ద్రోహానికి పాల్పడుతున్నాడు. మోసాలు చేస్తూనే మీసాలపై తేనియలనే ఆశించే వినాశకాల్నే కోరుకుంటున్నాడు. తన వర్గ ప్రయోజనాల కోసం ఇతర వర్గాల హక్కులను కాలరాస్తున్నాడు. స్వభాషాభ్యున్నతి కోసం అన్య భాషస్తులను కించపరుస్తున్నాడు. తన జాతి ప్రయోజనాల కోసం ఇతర జాతుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాడు. తన అభిమతోన్నతి కోసం ఇతర మతస్తులను సంహరిస్తున్నాడు. నేడు ఎటు చూసినా - ఒక వర్గం మరో వర్గంతో కయ్యానికి కాలు దువ్వుతోంది. ఒక జాతి మరో జాతిని తుదముట్టించేందుకు కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. ఊళ్ళ కాపురాలు వల్లకాటి దిబ్బల్ని తలపిస్తున్నాయి. ఈ ఘోర కలికి కారకులెవరు? అసలు దీని వెనక దాగిన కారకాలేమిటి? దీనికంటూ ఓ ముగింపు, ఓ పరిష్కారం, ఓ విరుగుడు లేదా? అన్నది బాధ్యత గల ప్రతి పౌరుణ్ణి కలచివేస్తున్న ప్రశ్న. భారత 60వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ ప్రశ్నకు ఉత్తరం ఇవ్వాలన్నదే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం!

ఒకప్పుడు మానవ సమైక్యతకు వంశం, భాష ఊతంగా నిలిచాయన్నది నిర్వివాదాంశం. ఆ తర్వాత జాతి అన్న భావన చోటు చేసుకుంది. ఒకప్పుడు వంశం, భాష రక్షణ కోసం పాటుపడిన మనిషి జాతి అభ్యుదయం కోసం పరిశ్రమించడం ప్రారంభించాడు. ఒకప్పుడు తెగల కుదురు చిహ్నాలుగా చెలామణిలో ఉన్నవి జాతీయ చిహ్నంలో మమేకమయాయి. ఇక జాతి అన్నది ఏ ప్రాతిపదిక ఆధారంగా ఏర్పడుతుంది? అది ఎప్పుడు బలాన్ని పుంజుకుంది? అన్న విషయానికొస్తే - జాతి అనే తెలుగు మాట 'నేషన్' అనే ఆంగ్ల పదానికి పర్యాయపదం. యూరప్ లో అనువంశిక సామ్రాజ్యాలు ముక్కలయి జాతీయ రాజ్యాలు ఉద్భవించిన తరుణం లో, అంటే- 18, 19 శతాబ్దాలలో ఈ పదం వాడుకలోకి వచ్చింది. జాతి అనే కాంశాల ఆధారంగా ఏర్పడుతుంది. భౌగోళిక ప్రదేశం, చరిత్ర నాగరికత, సంస్కృతి, భాష, తెగ, మతం లాంటి అనేకం జాతి ఏర్పడటంలో దోహదం చేస్తాయి. అయితే ఒక్కో దేశంలో ఒక్కో అంశం ప్రాధాన్యత వహిస్తుంది. యూద జాతి నిర్మాణంలో మతం ప్రముఖ పాత్ర పోషించింది. భారత జాతి ఏర్పడటంలో రెండు వందల సంవత్సరాలు తెల్లదొరల పరిపాలన క్రింద దేశం ప్రగ్గడం ఉప కరించింది. బ్రిటన్ లాంటి దేశాలలో భౌగోళిక పరిస్థితి ప్రధానాంశం అయింది. ఫ్రెంచి జాతీయత ఉదయించడానికి ఫ్రెంచి భాష కారణం అయింది.

జాతీయతకు రెండు లక్షణాలున్నాయి. ప్రజలందరికి ఒక వ్యక్తిత్వాన్ని ఆపాదించుకునే పద్ధతి ఒకటి. దీనితో ఎవరికీ ఎలాంటి పేచీ ఉండదు, ఉండకూడదు. ఇతర జాతులను ద్వేషించడం, అసహ్యించుకోవడం, తామే అధికులమనుకోవడం, తమ విలక్షణత్వాన్ని ఇతరులను న్యూనత పరిచే విధంగా ప్రచారం చేసుకోవడం రెండవ పద్ధతి. ఈ పద్ధతిని హిట్లర్, ముస్సోలిని, టోజోలు అవలంబించారు. వారి నాయకత్వంలో జర్మన్, ఇటలీ, జపాన్ దేశాలు రెండో ప్రపంచ యుద్ధాన్ని తెచ్చి పెట్టాయి. నాజీజం, ఫాసిజం, షింటో యిజం పేరుతో దుష్ట జాతీయతను ప్రచారం చేశాయి. కనుక జాతీయ వాదాన్ని గుడ్డిగా సమర్థించలేము. ఈ విషయంలో ప్రతి ఒక్కరు కడు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంది.

జాతీయ సమైక్యత పేరుతో, పీస్ నినాదంతో నేడు సర్వత్రా కానవస్తున్న స్వజాతి దురభిమానాన్ని, దురాక్రమణ మనస్తత్వాన్ని పెంపొందించడం అనేది పూర్తిగా నశించాలి. అలా చేయని పక్షంలో ఆయా దేశ పౌరులకు నష్టమే కాకుండా ప్రపంచ ప్రజలకు కూడా కష్టాలు సంభవిస్తాయి. మన ఇల్లు మనం చక్కబెట్టుకోవడం వేరు. ఇతర దేశ ప్రజలను కించపర్చడం, బాధించడం, ద్వేషించడం వేరు. అలాగే సమైక్యత పేరుతో మత దురహంకారాన్ని, మతాధిపతుల, స్వాముల, ఆసాముల, బాబాల భాగోతాన్ని, పెత్తనాన్ని, మతం పేర సాగే దుష్టాచారాలను, మారణహోమాలను సహించడం, ప్రోత్సహించడం ఎంత మాత్రం సముచితం కాదు. సమైక్యత పేరుతో దేశ ప్రజల్లోని కొందరి నిర్హేతుక చర్యలకు ఊతంగా నిలవడం, మైనార్టీల విశ్వాసంతో ముడి పడివున్న అంశం అంటూ 'క్షీర నీర న్యాయా'న్ని పాటించకుండా ద్వంద్వ అస్పష్ట తీర్పులు ఇవ్వడం, వారి విశ్వాసాలను మైనార్టీలపై బలవంతాన రుద్దడం ఘోరమైన తప్పిదం అవడమే కాక ఆయా జాతుల మనుగడకు గొడ్డలి పెట్టు అయ్యే ప్రమాదం ఉంది.

ప్రపంచంలో అనేక జాతులున్నాయి. ఇవన్నీ ఒకే ఒక్క మానవ జాతిలో మమేకాంశాలే. నాగరికత, సంస్కృతి, వీటి సందర్భ తేడాలు, తారతమ్యాలు ఉండ

వచ్చు. అయితే రంగు, భాష, రీతి రివాజులు ఇవి మానవ జాతి మధ్య అడ్డు గోడలు, అవరోధాలు సృష్టించే గడ్డు దినాలు పోయి, రంగు, భాషల వ్యత్యాసాన్ని దేవుని సూచనల్లోని ఓ సూచనగా గుర్తించే మంచి రోజులు రావాలి. ఖుర్‌ఆన్ ఇలా అంటోంది: **"ఆయన సూచనల్లో భూమ్యాకాశాల నిర్మాణం, మీ భాషలు, రంగుల వ్యత్యాసం కూడా ఉన్నాయి. విజ్ఞులకు ఇందులో అనేక సూచనలు ఉన్నాయి".** (రూమ్: 22)

ఒక జాతి ప్రత్యేక నైపుణ్యత విశిష్టత లక్షణం కావచ్చు. మరో దేశం వైమానిక ప్రపంచంలో అధిక్యత గలదై, ఇంకొకరు సముద్రాంతర నౌకాయానంలో ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించవచ్చు. అంత మాత్రాన ఏ ఒక్క జాతీ తానే ప్రశస్తనీయమైనదని భావించి ఇతర జాతులను అణగద్రొక్కే ప్రయత్నం చేయడం భావ్యం కాదు. ఇదే సూత్రం ఒకే దేశానికి సంబంధించిన జాతి, ఉపజాతుల విషయంలోనూ వర్తింప జేయాలి. ఖుర్ ఆన్‌లో ఇలా ఉంది:

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుంచి, ఒకే స్త్రీ నుంచి సృజించాము. తర్వాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగా, తెగలుగా చేశాము వాస్తవానికి మీలో అందరికంటే దైవ భీతి (తఖ్వా) గలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు. నిశ్చయంగా అల్లాహ్ సర్వ జ్ఞానం కలవాడు, సకల విషయాలు తెలిసినవాడు". (అల్ హుజ్రాత్: 13)

'దేవుడు భక్తీప్రపత్తులకే ప్రాధాన్యమిస్తాడు' అన్న ప్రకటన ద్వారా మనిషిలో ఉండే, జాతి, భాష, వంశ, ఆర్థిక, విద్యాపరమైన అహంభావాలన్నింటినీ పటా పంచలు చేయడం జరిగింది. ఏ దేశాన్ని ఏలే రాజైనా, ఏ బలైమైన జాతిని నడిపించే నాయకుడైనా, పెట్టుబడిదారుడైనా, పారిశ్రామికవేత్త అయినా, గొప్ప విద్యార్హతలు గలవాడయినా, అందమైన శరీరం, అంగ సౌష్టవం గలవాడైనా, ఎంతటి కలిమి బలిమి గలవాడైనా అందరూ ఆదం సంతానమే. ఆదంను దేవుడు మట్టితో సృజించాడు –**"కుల్లుకుమ్ మిన్ ఆదం వ ఆదము మిన్ తురాబ్"** అని ప్రవక్త శిఖామణి (స) నొక్కి వక్కాణించారు. మనిషి తన ఈ జీవిత సత్యాన్ని గ్రహించని, గ్రహించినా స్వీకరించని కారణంగానే మానవ చరిత్రలో అనేక అపశృతులు, అపసవ్యతలు చోటు చేసుకున్నాయి, చేసుకుంటున్నాయి.

యుద్ధానికి-యుద్ధానికి మధ్య విరామాన్ని శాంతిగా భావించడం, కలహానికి – కలహానికి మధ్య గడువును సామరస్య దశగా అభివర్ణించడం రెండూ పొరపాట్లే. కలహం, యుద్ధం బహిర్గత రూపాలు. ద్వేష భావం, ఉద్రిక్తత అంతర్గత రూపాలు. పరస్పరం శత్రుత్వం రెండు దశలకు ముఖ్య లక్షణం. అంతర్గత శత్రుత్వ భావన అంతరిస్తేగానీ శాంతికి, సామరస్యానికి బాటలు వేయలేము. విధిలేక, గతిలేక సుహృద్భావ లేమితో, వైర భావంతో ఉంటూనే వసుధైక కుటుంబం అనే భ్రాంతికి లోనై జీవించడం వేరు. యెదుటి వ్యక్తి పట్ల గౌరభావం కలిగి జీవించడం వేరు. మనిషి జీవిత రంగాలన్నింటిలోనూ సాత్వికంగా వ్యవహరించగలిగినప్పుడే లోక శాంతి సాధ్యమవుతుంది.

ఇక సాత్విక భావానికి ఆయువు పట్టు **'దేవుడు ఒక్కడే'** అన్న భావనే. ఈ తౌహీద్ భావన వల్ల విశ్వ జనీనత, సోదరభావం, సమతౌల్యం జనిస్తుంది. ఈ భావాన్ని ఆకళింపు చేసుకున్నవారు– భౌతికవాదులు, భావవాదులు, నాస్తికులు, ఆస్తికులు, హైందవులు, క్రైస్తవులు, యూదులు, మజూసీలు, సాబీలు – అందరిని దైవ దాసులుగానే భావిస్తారు. అలాగే సమస్త మానవాళికి సర్వోన్నతుడైన అల్లాహ్ చూపించిన జీవన విధానం ఒక్కటే – ఇస్లాం – శాంతిశ్రేయాల ధర్మం అని నమ్ముతారు. అయితే ఈ జీవన విధానం ఉద్భవించిన సమాజాల్లోని, ప్రవర్థమానమైన ప్రదేశాల్లోని ఆచారాలు, సంప్రదాయాలు, పూజా విధానాలు, ప్రార్థనా రీతులు మానవుల ప్రమేయంతో అందులో ప్రవేశించి దాని రూపురేఖల్ని మార్చేశాయి. కొంత కాలం వరకు వాటిని కొత్త పోకడలని ప్రతిఘటించిన మానవుడు క్రమేణా వాటికి బానిసయి దైవం నిర్దేశించిన నిజ జీవన ధర్మాన్ని వదులుకుంటూ వచ్చాడు. తర్వాత అవే అతని ధార్మిక జీవితాన్ని శాసించే స్థాయికి ఎదిగాయి. మానవ జాతి మనుగడ కోసం దైవం

తగాదాలు, కొట్లాటలు, కలహాలు సంఘ విద్రోహ శక్తులకు, శాంతి విఘాత కులకు, స్వార్థపరులకు మాత్రమే ఉపయోగపడతాయి. సామాన్య ప్రజానీకం మాత్రం తీవ్ర నష్టానికి, కష్టానికి గురవుతుంది. కాని స్వార్థపరులు మారరు, జనాన్ని మారనివ్వరు. అంతేకాదు ప్రజల ఈ వేర్పాటు మనస్తత్వాన్ని ఆధారం చేసుకుని వారిని రాజకీయ జూదంలో పావులుగా వాడుకుంటారు.

సూచించిన అసలు మౌలికాంశాల్ని, విలువల్ని తుంగలో త్రొక్కి, పాక్షికమైన అంశాల్నే ప్రధానంగా భావించడం జరిగిందని అర్థం చేసుకుంటారు. (వంశం, భాష, జాతి, సంపద మొదలైనవి) ద్వితీయ శ్రేణి అంశాలుగానే తల పోస్తారు. తద్వారా వారిలో– వారు ఏ ప్రాంతానికి చెందినవారైనా, ఏ భాష మాట్లాడేవారైనా, ఏ రూపు రంగు గలవారైనా భావ సారూప్యత, సాత్వికత గోచరిస్తుంది. అదే మానవ జాతి సమైక్యతకు పూబాటగా నిలుస్తుంది.

ఎందుకంటే, ఈ భావనను ఒంట బట్టించుకున్నవారు ప్రజా సంబంధాలను పటిష్టం చేసే – సత్య నిరతిని, సోదర భావాన్ని, ప్రేమ, కరుణ, దయ, క్షమ, సానుభూతి, పరోపకార పారీణత లాంటి సుగుణాలను సాటి జనుల్లో పెంపొందించే ప్రయత్నం చేయడంతోపాటే మానవాళి మొత్తంలో సమైక్యంగా భాసిల్లే ఏకాంశం వైపు మనుజ జాతిని ఆహ్వానిస్తారు. ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

(ప్రవక్తా!) వారికి స్పష్టంగా చెప్పు: **"ఓ గ్రంథవహులారా! మాలోనూ, మీలోనూ సమానంగా ఉన్న ఒక వాక్యం వైపుకు రండి. అదేమంటే మనం అల్లాహ్‌ను తప్ప వేరెవరినీ ఆరాధించకూడదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ కల్పించరాదు. అల్లాహ్‌ను వదలి మనలో ఎవరూ ఇంకొకరిని ప్రభువులుగా చేసుకోరాదు".** (ఆలి ఇమ్రాన్: 64)

'ఎప్పటికైనా విశ్వమానవ మతమనేది ఒకటి వెలిసిందంటే– అది తాను ప్రకటించే దేవునిలా దేశకాలాతీతమై, అనంతమై ఉండాలి' అన్న స్వామి

(మిగతాది 20వ పేజీలో)



ముహమ్మద్ హుస్సైన్ బొర్రా

పశ్చాత్తాపం

"తప్పు చేయటం మానవ సహజం – అయితే ఆ తప్పును ఒప్పుకుని క్షమాపణ కోరటం ఉత్తముల లక్షణం".

అవివేకం వల్లనో, మరేదైనా కారణం వల్లనో అపరాధానికి ఒడిగట్టినప్పుడు లేదా మానవ సహజమైన దౌర్బల్యం వల్ల ఏదైనా తప్పు జరిగినప్పుడు వెంటనే ఆ తప్పును సరిదిద్దుకోవడం ఒక విశ్వాసికి ఉండవలసిన ముఖ్య లక్షణం. అంతేకానీ నేను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు, నేనసలు తప్పు చేయను, నేను చేసింది ముమ్మాటికీ సరైందే అని, అసలు తప్పు చేయటం మా ఇంటా వంటా లేదని బుకాయించటం మూర్ఖుల లక్షణం.

ఎందుకంటే మహా ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: **"కుల్లు బనీ ఆదమ ఖత్తాఉన్, వ ఖైరుల్ ఖత్తాయీన అత్తవ్వాబూన్"** – ఆదం సంతానమంతా కూడా తప్పు చేయువారే, ఎవరైతే తమ తప్పును గుర్తించి మన్నింపు వేడుకుంటారో వారే ఉత్తములు.

"ఇన్నల్లాహ గఫూరుర్రహీమ్" అని మన కందరికి తెలుసు. అంటే నిస్సందేహంగా అల్లాహ్ మన్నించేవాడు మరియు కరుణించే వాడు. కాబట్టి ఇది తప్పు అని తెలిసినా మనం మన మనస్సు చెప్పినట్లు చేద్దాం, ఆయన క్షమించేస్తాడు అంటే కుదరదు. ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"మీలో ఎవరైనా అజ్ఞానం వల్ల చెడు పని చేసి, తరువాత పశ్చాత్తాపం చెంది, దిద్దు బాటుకు ప్రయత్నిస్తే అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా దయ జూపే వాడు". (అల్ అన్‌ఆమ్: 54)

తన పట్ల కృతజ్ఞతా భావంతో ఉండే దాసులను కరుణించాలని అల్లాహ్ నిశ్చయించుకున్నాడు. బుఖారీ మరియు ముస్లిం హదీసు ప్రకారం, అల్లాహ్ విశ్వ మండలాన్ని సృష్టించిన తర్వాత అర్ష్ అనే తన ఆసనంపై ఇలా లిఖించాడు 'నా కారుణ్యం నా ఆగ్రహాన్ని మించి ఉంటుంది'.

ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "ఎవరు విశ్వసించిన మీదట అవిశ్వాస వైఖరికి ఒడిగడతారో, ఆ తర్వాత అవిశ్వాసంలో మరింత పెచ్చరిల్లుతారో వారి పశ్చాత్తాపం సుతరామూ స్వీకరించబడదు. అపమార్గం పాలైనవాలంటే వీరే". (3: 90)

"అయితే ఆ తరువాత ఎవరు పశ్చాత్తాపం చెంది, తమ నడవడికను సరిదిద్దుకుంటారో వారు రక్షించబడతారు. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు". (3: 89)

ఈ వచనం అవతరింపచేయబడటానికి కారణం: మదీనా అన్సారుల్లో ఒక వ్యక్తి ధర్మభ్రష్టుడై బహుదైవారాధకులతో చేరి పోయాడు. కాని త్వరలోనే అతనికి జ్ఞానోదయమై, పశ్చాత్తాపంతో కుంచించుకు పోయాడు. తాను గనక తిరిగి రుజువర్తనుడైతే తన పశ్చాత్తాపం స్వీకారయోగ్యమవుతుందా? హల్ లీ మిన్ తౌబతిన్ (నాకు తౌబా చేసుకునే అవకాశముందా?) అని వేరొకరితో అడిగించాడు.

అల్లాహ్ పశ్చాత్తాప ద్వారాన్ని తెరిచి ఉంటాడు. ప్రవక్త ఉపదేశాన్ని అబూ మూసా అష్‌అరీ ఇలా ఉల్లేఖించారు: "అల్లాహ్ రాత్రి వేళ తన చెయ్యి చాపుతాడు – పగటి వేళ తప్పు చేసిన వారు పశ్చాత్తాపంతో ఆయన వైపు మరలాలని. అలాగే పగటి వేళ చెయ్యి చాపుతాడు – రాత్రి వేళ తప్పు చేసినవారు పశ్చాత్తాపంతో ఆయన వైపు మరలాలని. చివరికి సూర్యుడు పడమర నుండి ఉదయించే వరకు, అంటే ప్రళయ దినం వరకు ఇలానే జరుగుతూ ఉంటుంది.

తిర్మిజీ ప్రకారం, అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ ఇలా ఉల్లేఖించారు: "దాసుని చివరి ఊపిరి చెదరిపోయేంత వరకు అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు" అని ప్రవక్త (స) ప్రవచించారు. వ్యక్తిగతంగా ఒక మనిషి ప్రాణం గుండెలోంచి గొంతు దాటి బయటికి వచ్చేటప్పుడు ఈ పశ్చాత్తాపం స్వీకరించ బడదు. అంటే మరణ ఘడియల్లో చెందే పశ్చాత్తాపం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు.

ఖుర్ఆన్‌లో ఇలా ఉంది: "అవివేకం వల్ల ఏదైనా చెడు కార్యానికి పాల్పడి, వెంటనే తప్పు తెలుసుకుని పశ్చాత్తాపం చెందేవారి పశ్చాత్తాపాన్ని స్వీకరించే బాధ్యత మాత్రమే అల్లాహ్‌పై ఉంది. అటువంటి వారి పశ్చాత్తాపాన్ని అల్లాహ్ స్వీకరిస్తాడు. అల్లాహ్ మహా జ్ఞాని, గొప్ప వివేకవంతుడు".

(అన్ నిసా: 17)

మరో చోట ఇలా సెలవియ్యబడింది: "నిరంతరం పాప కార్యాలకు పాల్పడుతూ, తీరా మరణ ఘడియలు సమీపించాక 'ఇప్పుడు నేను పశ్చాత్తాపడుతున్నాను' అనే వారి పశ్చాత్తాపం ఆమోదించబడదు. అలాగే అవిశ్వాస స్థితిలో ప్రాణం విడిచే వారి పశ్చాత్తాపం కూడా స్వీకరించబడదు. ఇలాంటి వారి కోసమే మేము వ్యధాభరితమైన శిక్షను ఉంచాము". (అన్ నిసా: 18)


అందుకే మరణ ఘడియల్లో ఫిరౌన్ "ఆమన్తు బిరబ్బి మూసా వ హారూన్" అంటే నేను మూసా మరియు హారూన్‌ల ప్రభువును విశ్వసిస్తున్నాను అన్నా కూడా వదిలి పెట్టడం జరగలేదు.

ఒక వ్యక్తి యావజ్జీవితం అజ్ఞానం వల్ల పాప పంకిలంలో గడిపి మరణశయ్యపై అవసాన దశకంటే ముందు నిర్మల హృదయంతో పశ్చాత్తాపడి క్షమాపణకై వేడుకుంటే అతని పాపాలన్నీ హరించిపోవచ్చు. కాని శ్వాస చెదరిపోయిన తర్వాత అవసాన దశలో క్షమాపణ వేడుకుంటే అది చెల్లదు.

ప్రవక్త (స) గారు ఎలాంటి తప్పులు చేయలేదు. అయినా "రోజుకి వంద సార్లు క్షమాపణకై వేడుకునేవారు. ఇక మన పరిస్థితి ఏంటో ఒక్కసారి ఆలోచించుకోవాలి. తెలియక చేసిన తప్పిదాలకు మన్నింపు వేడుకోవడం సమంజసం కానీ మళ్ళీ మళ్ళీ అదే పునరావృతం చేయటం గర్హనీయం. అందువల్లే మృత్యువును ఎదుర్కునే ముందే మనిషి జాగ్రత్త పడాలి. అపరాధాల క్షమాపణకై వేడుకోవాలి. ఎవరి మృత్యువు ఎప్పుడు దాపురిస్తుందో ఎలా చెప్పగలం?

- అబూ అతీఖ్

రాష్ట్రానికి రానున్నవి గడ్డు రోజులేనా?



ఈ సంచిక పాఠకుల చేతికి అందే సరికి శ్రీకృష్ణ కమిటీ నివేదిక వెలువడి ఉంటుంది. కమిటీ సిఫారసులు ఎలా ఉన్నా - తెలంగాణా ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నా, తటస్థంగా ఉన్నా, లేక అనూహ్యంగా ఉన్నా - ముందున్నది మొసళ్ళ పండగే. ఆ మాట వరంగల్ 'మహా గర్జన' సభలో కె.సి.ఆర్ చెప్పనే చెప్పారు. కరవమంటే కప్పకు కోపం, విడువమంటే పామకు కోపం అన్నట్టు తయారయింది మన రాష్ట్ర పరిస్థితి.

తమ కమిటీ నివేదిక ఎలా ఉన్నాసరే నిగ్రహం పాటించాలని, ప్రజాస్వామిక స్ఫూర్తితో స్పందించాలని శ్రీ కృష్ణ కమిటీ చైర్మెన్ ముందస్తుగా ప్రకటించారు.

గత ఏడాది కె.సి.ఆర్ నిరాహారదీక్ష అనంతరం తెలుగు రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం శ్రీ కృష్ణ కమీషన్‌ను నియమించింది.

1956కు పూర్వం భాషా రాష్ట్రాల ఏర్పాటుకు సంబంధించి ఫజల్ అలీ కమీషన్‌కు ఎంత ప్రాముఖ్యం ఉందో అంతే ప్రాముఖ్యం శ్రీ కృష్ణ కమీషన్‌కు ఉంది. ఈ కమిటీ సభ్యులంతా ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలలో పర్యటించారు. రాజకీయ పార్టీలతో, మేధావులతో, సామాన్య ప్రజలతో, పాత్రికేయులతో అనేక విడతలుగా చర్చలు జరిపారు. చారిత్రక, భౌగోళిక పరిస్థితులను విశ్లేషించారు. నదీ జలాల పంపకంపై ఉన్న చిక్కుముడులను వీక్షించారు.

చర్చల సందర్భంగా రకరకాల అభిప్రాయాలు ముందుకు వచ్చాయి. కడు విచిత్రమైన ఆలోచనా ధోరణి కూడా పొడసూపింది. ప్రజా బాహుళ్యంలో అసంతృప్తితోపాటు ప్రాంతీయ దురభిమానం, సంకుచిత తత్వం, ద్వేషం రగులుతున్నట్లు కూడా తెలిసింది. రాష్ట్రాన్ని కనీసం నాలుగు ముక్కలు చేస్తేనేగానీ సమస్యకు పూర్తి పరిష్కారం లభించదని కొందరన్నారు. హైదరాబాద్ తెలంగాణాలో అంతర్భాగమని కొందరంటే, ఈ మహా నగరాన్ని సెపరేట్ స్టేట్‌గా ఉంచాలని మరి కొందరన్నారు. తెలంగాణాను, రాయల సీమతో కలిపి ఒక రాష్ట్రంగా ఉంచాలని ఇంకొందరన్నారు. ఎవరెవరితో కలిసి ఉన్నా మా ఉత్తరాంధ్రను మాకివ్వండి అని ఒక వర్గం వాదించింది. ఇన్ని వేర్పాటు మనస్తత్వాలున్న రాష్ట్రంలో శ్రీ కృష్ణ కమిటీ నివేదిక అందరినీ సంతృప్త పరచటం సాధ్యం కాదు కదా! మొత్తానికి రాష్ట్రానికి రానున్నవి గడ్డు రోజులే. 2011 కొత్త సంవత్సరాన్ని కొందరు వేడుకలతో మొదలెడితే, మరి కొందరు ఏజిటేషన్లతో మొదలెట్టబోతున్నారు.

ఈ మధ్య ఓ పాత్రికేయ మిత్రునితో ఈ అంశంపై చర్చించినప్పుడు అతను కొన్ని చిలిపి ప్రశ్నలు వేశాడు -యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యు. ఎస్.ఎ) మాదిరిగా భారతదేశంలో కోరినవారందరికీ ప్రత్యేక రాష్ట్రాలు ఇచ్చేసి అధికార వికేంద్రీకరణ చేస్తే తిక్క కుదురుతుంది. లేదంటే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యు.ఎ.ఈ) తరహాలో మరిన్ని కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేసి స్వయం ప్రతిపత్తి ఇచ్చేస్తే ఉండదు అన్నాడతను. అలా చేస్తే కోతికి కొబ్బరి చిప్ప ఇచ్చినట్లే అవుతుందని నేనన్నాను. ఇప్పుడు మాత్రం కోతి వేషాలు వేయటం లేదా? అని అతను ఎదురు ప్రశ్న వేశాడు. ఎవరి సంగతి ఎలా ఉన్నా 'దేశ సమగ్రత' గురించి గొప్ప లెక్చర్లు ఇచ్చే భాజపా వంటి పార్టీలు ప్రాంతీయ వాదాన్ని వెనకేసుకురావటం విడ్డూరం అన్నాడు ఆ మిత్రుడు.

మధ్యప్రదేశ్ నుంచి వేర్పరచిన చత్తీస్ గఢ్ ఏం సాధించింది? అక్కడి పరిస్థితి మూడు ఎస్‌కౌంటర్లు ఆరు బాంబ్ బ్లాస్టులుగా వర్ధిల్లుతున్న సంగతి మధ్య ప్రదేశ్‌ను విభజించిన భాజపాకు మాత్రం తెలీదా? అంటూ నన్ను టపటపా వాయించేశాడు. అతను చెప్పిన మాటల్లో కూడా వాస్తవం లేకపోలేదు.

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఇప్పుడు కేంద్రం చేతుల్లో ఉంది. ఢిల్లి పెద్దలు ఏం చేస్తారో చూద్దాం. ఈ సందర్భంగా మనం కొన్ని విషయాలను గమనించాలి -

★ మనది ప్రజాస్వామిక దేశం. ప్రజాస్వామికంగా తమ హక్కుల కోసం పోరాడే స్వేచ్ఛ అందరికీ ఉన్న మాట వాస్తవమే. కాని ఆ స్వేచ్ఛ ప్రజా జీవితాల్లో అపసవ్యతకు, వైషమ్యానికి బీజం నాట కూడదు.

(మిగతాది 20వ పేజీలో)

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్



ఖుర్‌ఆన్ వెలుగులో యేసు (ఈసా ﷺ) -2

దైవప్రవక్తగా యేసు క్రీస్తు

ఇంతకు ముందు ప్రస్తావించినట్లు దేవుడు యేసు (ఈసా)ను తన ప్రవక్తగా ఎన్నుకున్నాడు. ఇస్రాయీలు వంశీయుల్లో దారి తప్పిన వారిని సంస్కరించి, రుజు మార్గం చూపడానికి యేసు నడుం బిగించారు. ప్రవక్తలందరికీ వహీ (దైవ సందేశం) అందినట్లే ఈయనకూ 'వహీ' అందింది. ఈయన జనులకు శుభ వార్తలూ అందజేశారు. హెచ్చరికలు కూడా చేశారు. ఈ విషయాన్నే ఖుర్‌ఆన్ ఇలా వివరించింది:

(ఓ ముహమ్మద్!) మేము నూహ్ వైపునకు, అతని తరువాత వచ్చిన ప్రవక్తల వైపునకు 'వహీ' పంపినట్లే (దైవ వాణిని అవతరింపజేసినట్లే) నీ వైపునకు కూడా 'వహీ'ని పంపాము. ఇంకా మేము ఇబ్రాహీము, ఇస్మాయీలూ, యాఖూబు, మరియు అతని సంతతి వారికి, ఈసా, అయ్యూబు, యూనుసు, హారూను, సులైమానుల వైపునకు కూడా వహీ పంపాము. ఇంకా మేము దావూదుకు జబూరు (గ్రంథం) వొసగాము".

(4: 163)

యేసు క్రీస్తు తనకు పూర్వం వచ్చిన మూసా ప్రవక్తను ధృవీకరించారు. మూసా ప్రవక్త (అ)పై అవతరింపజేయబడిన తౌరాతు గ్రంథాన్ని సత్యమని ధృవ పర్చారు. తన తర్వాత రాబోయే ప్రవక్త గురించి శుభవార్త అందిస్తూ, అతని పేరు 'అహ్మద్' అని చెప్పారు. సూరె సఫ్‌లోని ఈ ఆయతును గమనించండి –

"మర్యమ్ కుమారుడైన ఈసా, 'ఓ ఇస్రాయీలు సంతతి వారలారా! నేను మీపై అల్లాహ్ తరఫున పంపబడిన ప్రవక్తను. నాకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను. నా తర్వాత రాబోయే ఒక ప్రవక్తను గురించి శుభ వార్తను అందజేస్తున్నాను. అతని పేరు 'అహ్మద్' అని చెప్పినప్పటి సంగతి (ని జ్ఞప్తికి తెచ్చుకోండి). తీరా అతను స్పష్టమైన నిదర్శనాలను తీసుకువచ్చి నప్పుడు, 'ఇది పచ్చి ఇంద్రజాలం' అంటూ వారు తేలిగ్గా కొట్టిపారేశారు". (61: 6)

అ) పై వచనంలో తరువాత రాబోయే అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) గురించి శుభవార్త ఇవ్వబడింది. అందుకే మహా ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అంటూ ఉండేవారు:

"నేను నా పితామహుడైన ఇబ్రాహీమ్ ప్రార్థనా ఫలాన్ని. ఈసా (యేసు క్రీస్తు) అందజేసిన శుభవార్తకు ప్రతి రూపాన్ని".

(ఐసరుత్తఫాసీర్)

ఆ) ఇక 'అహ్మద్' అనే పదానికి రెండు అర్థాలు వస్తాయి. ఒకటి: జనులందరిలో కెల్లా ఎక్కువ దైవస్తోత్రం చేసేవాడు. రెండవది: తనలోని సుగుణాల దృష్ట్యా అందరికన్నా అధికంగా ప్రశంసించబడిన వాడు. రెండింటిలో ఏ విధంగా చూసినా ఇది 'ఆ ప్రవక్త (స)'కు అతికినట్లే సరి పోతుంది.

దైవ ప్రవక్త యేసు (ఈసా – అలైహి) మహిమలను చూపారని ఇంతకుముందు కూడా చెప్పుకున్నాం. కాని ప్రవక్తపై నమ్మకం లేనివారు అతని మహిమలను కనికట్టుగా భావించి తేలిగ్గా కొట్టి పారే స్తారు. కనికట్టు వేరు – మహిమ వేరు. ప్రవక్తలు ఎన్నడూ కనికట్టును, జాల విద్యను ఆశ్రయించరు. వారు చూపే మహిమలు దైవాజ్ఞతో ప్రస్ఫుటం అవు తాయి. వాటి వెనుక దేవుని పరమార్థం ఉంటుంది. ఏ ప్రవక్త అయినా సరే దైవాజ్ఞతో నిమిత్తం లేకుండా మహిమల ను చూపలేదు. ఖుర్‌ఆన్‌లో ఈసా (యేసు క్రీస్తు) గారి మహిమల ప్రస్తావన వచ్చి నప్పుడు దేవుడు ఒకటికి నాలుగు సార్లు **'నా అనుమతితో'** అని నొక్కి చెప్పాడు. అల్లాహ్ ఈ విధంగా అడుగుతాడు: "మర్యమ్ కుమారుడవైన ఓ ఈసా! నేను నీకు, నీ తల్లికీ ప్రసాదించిన అనుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకో. అప్పుడు నేను రూహుల్ ఖుదుస్ (జిబ్రయీల్) ద్వారా నీకు సహాయం చేశాను. నీవు ఊయలలో ఉన్నప్పుడు, పెద్దవాడైన తర్వాత కూడా ప్రజలతో మాట్లాడేవాడివి. అప్పుడు నేను నీకు గ్రంథాన్నీ, వివేకాన్నీ, తౌరాతునూ, ఇంజీలునూ నేర్పాను. అప్పుడు నీవు నా అనుమతితో మట్టితో పక్షి ఆకారం లాంటి దాన్ని తయారు చేసి, అందులోకి ఊద గానే నా అనుమతితో అది నిజంగానే పక్షి అయిపోయేది. అలాగే నీవు నా అనుమతి తో పుట్టు గుడ్డినీ, కుష్ఠు రోగినీ బాగు చేసే వాడివి. నా అనుమతితో మృతులను లేపి నిలబెట్టేవాడివి. నీవు స్పష్టమైన నిదర్శ నాలతో ఇస్రాయీలు వంశీయుల వద్దకు వచ్చినప్పుడు 'ఇది పచ్చి మాయాజాలం తప్ప మరేమీ కాదు' అని వారిలోని సత్య తిరస్కారులు చెప్పారు. ఆ సమయంలో మేము వాళ్ళను నీ నుంచి ఆపాము". (5: 110)

యూదులు యేసు క్రీస్తు (ఈసా)ను చంపడానికి కుట్ర పన్నారు. దేవుడు వారి బారి నుండి తన ప్రవక్తను రక్షించాడు. యేసు క్రీస్తు (ఈసా – అలైహి) కాలంలో సిరియా ప్రాంతం రోమనుల ఏలుబడిలో ఉండేది. ఈ ప్రాంతానికి రోమనుల ప్రతి నిధిగా అధికారంలో ఉన్న వ్యక్తి అవిశ్వాసి. యేసు క్రీస్తుకు వ్యతిరేకంగా యూదులు ఆ అధికారి చెవుల్లో లేనిపోనివి నూరి పోశారు. అతడు తండ్రి లేనివాడనీ, కల్లోల జనకుడనీ ఎద్దేవా చేశారు. వారి ఫిర్యాదులను పురస్కరించుకుని ఆ

అధికారి యేసు క్రీస్తును సురక్షితంగా ఆకాశంపైకి ఎత్తుకున్నాడు. ఆయనకి బదులు ఆయన్ని పోలి ఉన్న మరో వ్యక్తిని – అతనే యేసు అని భ్రమపడి – వారు శిలువ వేశారు. పైగా తాము యేసు క్రీస్తుకు మరణ దండన విధించామని వారు సంబరపడుతున్నారు. కాని ఎత్తు గడల్లో సాటిలేని మేటి అయిన దేవుడు యేసుక్రీస్తు శత్రువులను విచిత్రంగా ఏమార్చాడు. ఆ విషయాన్నే ఖుర్‌ఆన్ ఇలా ప్రస్తావించింది–

"నిజానికి వారు ఆయన్ని చంపనూ లేదు, శిలువపైకి ఎక్కించనూ లేదు. నిజం ఏమిటంటే, వారి కొరకు ఆయన్ని పోలిన వ్యక్తి రూపొందించబడ్డాడు. ఈసా విషయంలో విభేదించినవారు ఆయన వ్యవహారంలో సంశయానికి లోనయ్యారు. అనుమానాలను అనుసరించటం తప్ప వారికి ఈ విషయమై ఖచ్చితంగా ఏమీ తెలీదు. అసలు వారు ఆయన్ని చంపనే లేదు. పైగా అల్లాహ్ ఆయన్ని (యేసు క్రీస్తును) తన వైపునకు ఎత్తుకున్నాడు. అల్లాహ్ సర్వాధికుడు. మహా వివేకి".

(4: 157, 158)

తనను చంపాలన్న యూదుల కుట్రను గురించి తెలుసుకున్న యేసుక్రీస్తు (ఈసా) తన అనుచరులైన హవారీలను సమావేశ పర్చారు. ఈ హవారీల సంఖ్య 12 లేక 17 మాత్రమే. "మీలో ఎవరైనా నాకు బదులుగా శిలువ ఎక్కడానికి సిద్ధంగా ఉన్నారా? ఈ త్యాగానికి సిద్ధపడిన వారికి దేవుడు నా రూపు రేఖలను ప్రసాదిస్తాడ"ని యేసు క్రీస్తు చెప్పగానే, హవారీలలోని ఒక యువకుడు ఈ సాహసానికి సిద్ధమయ్యాడు. అప్పుడు యేసు క్రీస్తు (ఈసా) అక్కడి నుండి ఆకాశానికి ఎత్తుకోబడ్డారు. తరువాత యూదులు వచ్చి, యేసు క్రీస్తు (ఈసా)ను పోలివున్న వ్యక్తిని తీసుకెళ్ళి శిలుపైకి ఎక్కించారు. తాము ఈసా (యేసు)ను శిలువపై ఎక్కించామని యూదులు తలపోశారు. కాని యదార్థానికి యేసు అక్కడ లేనేలేరు. ఆయన సజీవ స్థితిలోనే ఆకాశంపైకి ఎత్తుకోబడ్డారు. (ఇబ్నె కసీర్, ఫత్హుల్ ఖదీర్)

ఇస్రాయీలు సంతతిలోని మరో వర్గం మాత్రం ఈ విషయంలో సందేహంలో పడింది. శిలువపైకి ఎక్కించబడిన వ్యక్తి యేసు క్రీస్తు (ఈసా) కాదని, అతను వేరే మరో వ్యక్తి అని ఈ వర్గం గట్టిగా అనుమానించింది. అందుకే యేసు శిలువపైకి ఎక్కించబడ్డారన్న వాదనను అది త్రోసిపుచ్చింది. యేసు క్రీస్తు (ఈసా) ఆకాశం వైపు సాగిపోవటం కూడా వారు చూశారని కొంత మంది చెబుతారు. ఈ వ్యవహారం పై ఖుద్దుగా క్రైస్తవుల్లో భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. 'యేసు క్రీస్తు (ఈసా) నరాంశంగానైతే శిలువపైకెక్కారుగాని, దైవాంశంగా కాదు' అని నస్తూరియా వర్గం అభిప్రాయపడుతుంది. కాని ఈ హత్య నరాంశానికి, దైవాంశానికి కూడా పరిపూర్తి అయిందని మల్కానియా వర్గం గట్టిగా నమ్ముతోంది (ఫత్హుల్ ఖదీర్). మొత్తంమీద వారు ఈ విషయంలో సంశయాలలో ఊగిసలాడుతున్నారు.

కాగా; ఖుర్‌ఆన్‌లో చెప్పబడిన దాని ప్రకారం యేసు క్రీస్తు (ఈసా)ని దేవుడు సజీవంగా ఆకాశానికి ఎత్తుకున్నాడు. ప్రామాణిక హదీసుల ద్వారా కూడా ఈ విషయానికి సమర్థన లభిస్తున్నది. మహనీయ అబూ హురైరా, అబ్దుల్లా బిన్ మస్‌వూద్, అబ్దుల్లా బిన్‌అమ్ర్ బిన్ ఆస్ (ర. అన్హుమ్) తదితరుల చేత ఉల్లేఖించబడిన హదీసుల ప్రకారం యేసు క్రీస్తు (ఈసా) డెమాస్కస్‌లో మనారా (తూర్పు) ప్రదేశంలో, ఫజ్ర్ నమాజ్‌కై ఇఖామత్ చెప్పే సమయంలో భువి మీదకి దిగుతారు. ఆయన పందిని చంపుతారు. శిలువను విరగ్గొడతారు. జిజ్యాను మాఫీ చేస్తారు. ఆయన హయాంలో మానవులంతా ముస్లింలవుతారు. ఉపద్రవ జనకుడైన దజ్జాల్ కూడా ఆయనచేత సంహరించబడతాడు. ఆయన కాలంలో యాజూజ్, మాజూజ్‌ల ఉపద్రవం కూడా పుట్టుకు వస్తుంది. కడకు ఆయన శాపం మూలంగానే వారిరువురి కథ కంచికి చేరుతుంది.

ప్రవక్తలు ఎన్నడూ కనికట్టును, జాల విద్యను ఆశ్రయించరు. వారు చూపే మహిమలు దైవాజ్ఞతో ప్రస్ఫుటం అవుతాయి. వాటి వెనుక దేవుని పరమార్థం ఉంటుంది. ఏ ప్రవక్త అయినా సరే దైవాజ్ఞతో నిమిత్తం లేకుండా మహిమలను చూపలేడు.

అతిశయిల్లకండి

అల్లాహ్ మర్యమ్ కుమారుడగు యేసు క్రీస్తు (ఈసా) వాస్తవికతను వివరించిన తరువాత దైవప్రవక్తగా యేసు చేసిన సత్య బోధనలను ఖచ్చితంగా అవలంబించాలని, ధర్మావలంబనలో అతివాదానికి పోయి, దైవానికి అసత్యాన్ని అంటగట్టరాదని యేసు అనుయాయులైన క్రైస్తవులకు హితవు పలికాడు. ఎందుకంటే యేసు క్రీస్తు (ఈసా) దేవుని దాసుడు మరియు దైవ ప్రవక్త మాత్రమే. ఇదిగో ఈ వచనాన్ని గమనించండి:

"ఓ గ్రంథవహులారా! మీరు మీ ధర్మం విషయంలో అతిశయిల్లకండి. సత్యం తప్ప మరో మాటను అల్లాహ్‌కు ఆపాదించకండి. మర్యమ్ కుమారుడైన ఈసా మసీహ్ కేవలం దైవ ప్రవక్త, ('అయిపో' అన్న దైవ వాక్కు ద్వారా పుట్టించబడిన వారు) మాత్రమే. దాన్ని ఆయన మర్యం వైపు ప్రయోగించాడు. ఇంకా ఆయన (ఈసా) దేవుని దగ్గర నుంచి వచ్చిన ఆత్మ మాత్రమే. కాబట్టి మీరు అల్లాహ్‌నూ, ఆయన పంపిన ప్రవక్తలందరినీ విశ్వసించండి. దేవుడు 'ముగ్గురు' అని అనకండి. ఈ (త్రిత్వం) వాదనను మానండి. ఇందులోనే మీకు మేలుంది. ఆరాధ్యుడగు అల్లాహ్ ఒక్కడు మాత్రమే. ఆయనకు కుమారుడున్నాడనే విషయానికి ఆయన అతీతుడు, పరిశుద్ధుడు. ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నదంతా ఆయనకు చెందినదే. కార్యనిర్వాహకారిగా అల్లాహ్ ఒక్కడే చాలు". (4: 171)

(ఇంకా ఉంది)

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

విలక్షణ శిక్షణ విశ్వ నాయకుల (స) వారిది

ఎందరో శుభాత్ములు, మరెందరో సుమనస్కులు, ఇంకెందరో సంఘ సంస్కర్తలు, ప్రజాశ్రేయోభిలాషులు, మహానుభావులు అవని తలాన్ని పావనం చేసేందుకు వీర కంకణం కట్టారు, విశ్వ ప్రయత్నం చేశారు. ఎన్నో సంస్కరణా ఉద్యమాలను, శాంతి విప్లవాలను లేవనెత్తి, వాటికి రథసారథులుగా వ్యవహరించారు. కాని వారిలోని అధిక శాతం మంది ఈ ఆశయ అభ్యున్నతికై సంఘ, సమాజ, దేశ బాహ్య స్థితిపై దృష్టి సారించినంతగా ఆంతరంగిక విషయాలపై, ఆత్మ పతనావస్థపై దృష్టి పెట్టలేక పోయారన్నది నిర్వివాదాంశం. అయితే వీరందరికీ భిన్నంగా మహా ప్రవక్త (స) వారి సత్యోద్యమంలో కార్యకర్తలుగా చేరిన ప్రతి వ్యక్తి బాహ్యపరంగా మెరుగులు దిద్దుకోవడమే కాక ఆత్మ సౌధ సౌందర్యాన్ని సయితం సొంతం చేసుకున్నాడు. మహా ప్రవక్త (స) వారి సత్య పిలుపుని సాదరంగా స్వాగతించి, సహజ సిద్ధంగా స్పందించిన వారందరూ ఆయన (స) నుండి విలక్షణ శిక్షణ గరిపి భావితరాలను భవిష్య రథసారథులై విజయ బాటన నడిపించారు. వారి అవిరళ కృషితో ఇస్లాం ధర్మ చల్లని నీడలో సేద తీర్చుకున్న ప్రతి వ్యక్తిలోనూ అపురూప ప్రవర్తనా శైలి పాదులు వేసుకుంది. మానవ చరిత్రలోనే కనీ, వినీ, ఎరుగని రీతిలో జీవించి మానవతే గర్వపడేలా అంచెలంచెలుగా మహోగ్ర శిఖరాన్ని అధిరోహించి పూర్తి మానవతకే తలమానికలయ్యారు.

వారిలోని ఈ రుజువర్తనమే అవిశ్వాస దళంలో కలకలం రేపింది. సత్యకేతనాన్ని సాహసోపేతంగా ఎగురవేసింది. అనాగరిక, అజ్ఞాన, అంధకార, ఆటవిక దుష్ప్రవృత్తి పిపాసుల శర పరంపరల ముందు బారచాచి నిలబడింది. ఆ నిరుపమాన ప్రవర్తనే ప్రచండ నిప్పుల్ని కురిపించే మక్కా లోయల్లో, సలసల కాగే ఇసుక తిన్నెలపై నగ్న శరీరాలతో ఈడ్చుకెళుతున్నా, అగ్ని కణంలా మండే బండరాళ్ళను గుండెల మీద పెట్టి చిత్రహింసలు పెడుతున్నా, పగ ప్రతీకారం అనే కొలిమిలో పడేసి వేంచేస్తున్నా బెదరక, అదరక 'అల్లాహు అహద్, అల్లాహు అహద్' అన్న నినాదాన్ని కర్కశుల కర్ణ పుటాలు చిల్లుపడేలా వినిపించింది ఆ అపురూప నడవడికే. ధన కనక వస్తువుల్ని కాలదన్ని, సకల భోగభాగ్యాలను పరిత్యజించి ధర్మోన్నతి కోసం కటిక దారిద్ర్యాన్ని ఇష్టపడేలా ప్రోత్సహించింది ఆ విలకణ శిక్షణే. నజాషీ దర్బారులో ఈ శిక్షణ ప్రదర్శించిన ధైర్యసాహసాలు ఓ కొత్త చరిత్రకు నాంది వాచకమయ్యాయి. ఈ శిక్షణా ఫలితమే 'ఇంట సామగ్రినంతా తీసుకువచ్చి ప్రవక్త (స) సన్నిధిలో సవినయంగా సమర్పించుకుని సంబర పడేవారు ఒకరైతే, రోజంతా కష్టపడి సంపాదించిన ఒకే ఒక్క సేరు ఖర్జూరాలు తప్ప తన వద్ద ఆ రోజు గడవడానికి, పొట్ట నింపుకోవడానికి మరేది లేదని తెలిసి కూడా దైవ మార్గంలో ఖర్చు చేసి సంతృప్తి చెందుతున్నారు మరొకరు. ఈ శిక్షణా ప్రభావం వల్లనే తాను పస్తులతో ఉండి ఇంటికొచ్చిన అతిథి పుష్టిగా భోంచేయాలని అభిలషించింది ఇంకొకరు. ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే, తాము పస్తులతో ఉన్నామన్న విషయం అతిథికి తెలియకూడదని ఆ దంపతులిద్దరు దీపం ఆర్పి వేసి తామూ తింటున్నట్లు అభినయించి అతిథి సత్కారాన్ని లోకానికి చాటి చెప్పారు. పరుల ఆకలి తీర్చి ఎలా ఆనందపడాలో నేర్పారు. ఈ శిక్షణా ప్రభావం వల్లనే యుద్ధ మైదానంలో క్షతగాత్రులయిన కొందరు గుక్కెడు తన్నీరు త్రాగి గుప్పెడు ప్రాణాల్ని కాపాడుకునే వీలుండి కూడా తమ దాహంకన్నా సోటి సోదరుని దాహానికే, ప్రాణానికే ప్రాధాన్యమిచ్చి పచ్చి నీరు కూడా ముట్టుకోకుండా ప్రాణాలు వీడి పరమోన్నత మిత్రుని సన్నిధికి ప్రశాంత చిత్తంతో పయనించారు. ఈ శుభాత్మలపై అల్లాహ్ కృపాకటాక్షాలు ఎల్లేడలా కురియుగాక!

ఈ శిక్షణా ప్రభావంతోనే రణరంగంలో అన్నింటికన్నా ప్రియమైన ప్రాణాల్ని వదలుతూ "ఫుజ్‌తు వ రబ్బిల్ కాబా" (కాబా ప్రతిష్ఠాలయ ప్రభువు సాక్షి! నేను కృతకృత్యుణ్ణయ్యాను) అనగలిగాడు ఓ సత్య సమర యోధుడు. ఈ శిక్షణా ఫలితమే – "పాలల్లో నీళ్ళు కలుపు" అని తల్లి పదే పదే పురమా యిస్తున్నా 'ససేమిరా' అంటూ, 'ఉమర్ చూడకపోయినా ఉమర్ ప్రభువు చూస్తున్నాడుగా!' అని జవాబిచ్చింది ఓ ఆడబిడ్డ. ఈ అసామాన్య శిక్షణ కారణంగానే 'మద్యం నిషేధం' అన్న ఆజ్ఞ వినగానే ఇంట్లో దాచిపెట్టిన సారా మొత్తాన్ని వీధిలో పారవేసారు యత్రిబ్ ప్రజలు. ఈ అద్వితీయ శిక్షణ ప్రభావమే 'జిహాద్ కోసం పిలుపు విని, అరికాలి వ్రేళ్ళ మీద నిలబడి మరీ తనది జిహాద్ చేసే వయసేనని నిరూపించే ప్రయత్నం చేశాడు ఓ కుర్రాడు. మానవ దౌర్బల్యాల కారణంగా అప్పు డప్పుడు ప్రవక్త (స) వారి శిష్యుల్లో అపసవ్యతలు, అపశృతులు చోటు చేసుకుంటే ఏ ప్రభుత్వాధికారి ఒత్తిడి లేకుండా తనకు తానుగా ప్రవక్త (స) సన్నిధికి వచ్చి చేసిన నిర్వాకంపై సిగ్గుతో కుమిలిపోతూ "యా రసూలల్లాహ్! నన్ను పావనం గావించండి" అని కడు దీనంగా ప్రాధేయపడేలా చేసింది ఈ నిరుపమాన శిక్షణే. ఈ అత్యుత్తమ శిక్షణ ఫలితమే గవర్నర్ హోదా పొంది కూడా సామాన్య పౌరునిలా శ్రమిస్తూ, తన కష్టార్జితంతోనే కడుపు నింపుకునే ఆదర్శ నాయకులు వెలిసింది. ఈ ఘనతర శిక్షణ ప్రభావమే – 'ఈ రోజు నుండి వీరు మీ ఇస్లామీయ సోదరులు' అన్న ఒకే ఒక్క ఉపదేశంతో తన సంపదలోని సగాన్ని అతనికి పంచి పెట్టేంత ఔదార్యాన్ని జనింపజేసింది. విశ్వ నాయకుల వారి ఈ విలక్షణ శిక్షణ ఎట్టిదంటే, అది గ్రహించిన ప్రతి చరిత్ర కారుడు నివ్వెరపోక మానడు. విశ్వ నాయకుల (స) వారు గరిపిన ఈ అపురూప శిక్షణ ఎలా సాగిందో సునిశితంగా పరిశీలిద్దాం రండి....!

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్



న్యాయం కోసం నిలబడండి

"ఓ విశ్వసించిన వారాలారా! మీరు న్యాయం విషయంలో గట్టిగా నిలబడండి. అల్లాహ్ ప్రసన్నత నిమిత్తం (సత్యం మాత్రమే పలికే) సాక్షులుగా ఉండండి – అది మీ స్వయానికీ, మీ తల్లిదండ్రులకు, మీ బంధువులకు వ్యతిరేకంగా పరిణమించినాసరే![1] అతను ధనికుడయినా, పేదవాడయినా సరే. వారి పట్ల అల్లాహ్ (మీకన్నా) ఎక్కువ శ్రేయోభిలాషి[2] కాబట్టి మీరు మీ మనోవాంఛలకు లొంగిపోయి న్యాయాన్ని వీడకండి. ఒకవేళ మీరు మీ సాక్ష్యాన్ని వక్రీకరించినా, సాక్ష్యం చెప్పడానికి విముఖత చూపినా మీరు చేసే పనులన్నీ అల్లాహ్‌కు తెలుసు సుమా!"

(దివ్య ఖుర్‌ఆన్– అన్ నిసా: 135)

1) నిత్యం న్యాయానికి, ధర్మానికి కట్టుబడి ఉండాలని సాక్ష్యమిస్తే సత్యబద్ధంగానే ఇవ్వాలనీ ఈ వచనంలో విశ్వాసులకు అల్లాహ్ గట్టిగా తాకీదు చేస్తున్నాడు. తాము చెప్పే సాక్ష్యం తమకు, తమ తల్లిదండ్రులకు, తమ ఆత్మీయులకు నష్టకరంగా పరిణమించినప్పటికీ వెనుకాడరాదని కూడా ప్రబోధించడం జరిగింది. ఎందుకంటే సత్యం అన్నింటికన్నా ముఖ్యం. అందరినీ శాసించగలిగేది సత్యం మాత్రమే.

2) అంటే నిందితుడు శ్రీమంతుడైనందున న్యాయం, సాక్ష్యం విషయంలో అతని పట్ల సడలింపుల ధోరణిని అవలంబించటం గానీ, లేక అతడు పేదవాడయినందువల్ల అతని మీద జాలి పడటంగానీ చేయకూడదు. వాళ్ళ విషయంలో దేవుడు మీకన్నా ఎక్కువ ప్రేమమయుడు.

3) అంటే మనోవాంఛ, బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతం, వర్గ దురభిమానం, రాగద్వేషాలు మిమ్మల్ని న్యాయం, ధర్మాల విషయంలో గుడ్డివారిగా చేయరాదు సుమా! ఈ విషయాన్నే అల్లాహ్ వేరొక చోట ఇలా సెలవిచ్చాడు: "ఒకరి పట్ల గల విరోధం కారణంగా మీరు న్యాయాన్ని వదలకండి".

(అల్ మాయిదా: 8)

అరబీలో **'తల్‌వూ'** అనబడింది. ఇది 'లై' నుండి ఏర్పడిన పదం. లై అంటే విషయాన్ని వక్రీకరించటం, తారుమారు చేయటం, ఉద్దేశ్యపూర్వకంగా అబద్ధం చెప్పటం అని అర్థం. అంటే తప్పుడు సాక్ష్యం ఇవ్వటం, సాక్ష్యానికి పెడర్థాలు తీయటం అని భావం. విముఖత చూపడమంటే సత్యాన్ని కప్పి పుచ్చటం లేక సాక్ష్యం చెప్పకుండా ఉండటం అన్న మాట!

ఈ రెండు విషయాలకు కూడా దూరంగా ఉండాలని తాకీదు చేయబడింది. దీని సారాంశం ఇది: అ) ఎట్టి పరిస్థితిలోనూ న్యాయం చేయాలి. న్యాయం విషయంలో వైముఖ్య ధోరణి పనికిరాదు. తాము చెప్పడం వల్ల ఒకరు తమ గురించి ఏమనుకుంటారోనని ఆలోచించకూడదు. ఆశ్రిత పక్షపాతానికి ఏ మాత్రం తావీయకూడదు. పైగా ఈ ధర్మకాటాను నెలకొల్పటంలో పరస్పరం అందరూ సహాయసహకారాలందించుకోవాలి.

ఆ) న్యాయం చెప్పేటప్పుడు, సాక్ష్యం ఇచ్చేటప్పుడు కేవలం దైవ ప్రీతి మీ దృష్టిలో ఉండాలి. అప్పుడే మీరు విషయానికి వక్ర భాష్యం చెప్పటం, లేనిపోని మతలబులు తీయటం, సాక్ష్యాన్ని దాచటం వంటి వాటికి దూరంగా ఉంటారు. ఇంకా మీరు సమత్వం, సమ తూకాలను స్థాపించగలుగుతారు.

ఇ) మీరు ఇచ్చే తీర్పు స్వయంగా మీకు, మీ తల్లిదండ్రులకు, మీ ఆప్తులకు నష్టకరంగా రూపొందినాసరే మీరు న్యాయం నుంచి వైదొలగకూడదు. సర్వకాల సర్వావస్థల్లో మీరు న్యాయంపై నిలకడగా ఉండాలి.

ఈ) కలవారి కీర్తిప్రతిష్టల్ని చూసి మెతక వైఖరి అవలంబించటమో, లేనివారి దైన్యస్థితికి జాలిపడి మృదువుగా వ్యవహరించడమో చేయకండి. వారిద్దరి పాలిట ఏది శ్రేయస్కరమో దైవానికే బాగా తెలుసు. జ) తీర్పు సమయంలో మనోవాంఛలకు దాసులైపోయి, ఒక వైపు మొగ్గిపోవడం, వర్గ దురభిమానం చేత అన్యాయస్థునికి అండగా నిలవటం వంటివి సుతరామూ సహించరానివి. కాబట్టి ఈ సంకుచిత, పక్షపాత పద్ధతులన్నింటినీ అధిగమించి నిష్పక్షపాతంగా న్యాయం చేయండి.

ఈ సమత్వం, సమతూకం నెలకొల్పబడే సమాజంలో శాంతీ సుస్థిరతలు వెల్లి విరుస్తాయి. ఆ సమాజంపై దేవుడు తన కారుణ్యాన్ని కురిపిస్తాడు. కటాక్షిస్తాడు. ఈ విషయాన్ని మహా ప్రవక్త (స) గారి సహచరులు బాగా అర్థం చేసుకున్నారు. దానికొక ఉపమానం ఇది: ఖైబర్‌లో యూదుల అధీనంలో ఉన్న పొలాలు, తోటల ఉత్పత్తులను అంచనా వెసే నిమిత్తం మహా ప్రవక్త (స) తన సహచరులైన అబ్దుల్లాహ్ బిన్ రవాహా (ర)ను పంపించారు. తీరా అక్కడకు చేరుకున్నాక యూదులు ఆయనకు లంచం ఇవ్వబోయారు. ఆయన వారి యెడల పట్టువిడుపుల ధోరణి అవలంబించాలన్నదే ఆ లంచం ఉద్దేశ్యం. దానికాయన ఏమన్నారో చూడండి: "దైవం తోడు! ప్రపంచంలో నాకు అందరికన్నా ప్రియతముడైన వ్యక్తి తరఫున నేను ప్రతినిధిగా వచ్చాను. నా దృష్టిలో అత్యంత అయిష్టకరమైన వారు మీరు. అయితే నాయకుని ప్రేమగానీ, మీ పట్ల నాకున్న అయిష్టత గానీ నన్ను అన్యాయం కొరకు పురికొల్పలేవు". ఆయన గారి మాటలు విను, "ఈ సమతూకం (న్యాయశీలం) మూలంగానే భూమ్యాకాశాల వ్యవస్థ సురక్షితంగా నిలబడి ఉంది" అని యూదులు అభిప్రాయ పడ్డారు. (తఫ్సీర్ ఇబ్నె కసీర్)

అబ్దుల్ మతీన్ ఉమ్రీ

ముస్లిం ధార్మిక విశ్వాసం

ప్రశ్న: అతి పెద్ద షిర్కుకు ఒడిగట్టడం వల్ల కలిగే నష్టం ఏమిటి?
జవాబు: అతి పెద్ద షిర్కు నరకంలో శాశ్వతంగా ఉండటానికి కారణం అవుతుంది.
ఖుర్‌ఆన్: "ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయం అందించే వాడెవడూ లేడు".
(అల్ మాయిదా: 72)
హదీస్: షిర్కుకు ఒడిగడుతూ మరణించిన వ్యక్తి నరకానికి వెళ్తాడు.
(ముస్లిం)
ప్రశ్న: 'షిర్కు'కు ఒడిగడుతూ సత్కార్యాలు ఆచరిస్తే ప్రయోజనం ఉంటుందా?
జవాబు: 'షిర్కు'కు ఒడిగడుతూ సత్కార్యాలు ఆచరిస్తే ప్రయోజనం ఏమీ ఉండదు.
ఖుర్‌ఆన్: ఒకవేళ వారు షిర్కు చేస్తే, అల్లాహ్ వారి సత్కార్యాలను నాశనం చేస్తాడు. (అల్ అన్‌ఆమ్: 88)
హదీస్: ఏదైనా కార్యంలో నాతోపాటు ఇతరులను భాగస్వాములుగా చేస్తే, నేను అలాంటి వ్యక్తిని, అతని భాగస్వామ్యానికే వదలి పెడతాను. (ముస్లిం)
ప్రశ్న: ముస్లింలో కూడా షిర్కు ఉందా?
జవాబు: అవును ఉంది. అనేక మంది ముస్లింలు షిర్కుకు (తెలిసో తెలియకో) పాల్పడుతున్నారు. ఇది ఎంతో బాధాకరమయిన విషయం.
ఖుర్‌ఆన్: వారిలో అల్లాహ్‌ను విశ్వసించేవారు ఎంత మంది లేరు! కాని వారు ఆయనతోపాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతూ ఉంటారు.
హదీస్: నా అనుచర సమాజంలో కొన్ని తెగలు బహుదైవారాధకుల్లో కలిసిపోయినప్పుడు, విగ్రహారాధన విచ్చలవిడిగా జరుగుతున్నప్పుడు ప్రళయం సంభవిస్తుంది.
ప్రశ్న: అల్లాహ్ తప్ప ఇతరులను వేడుకోవడం, అంటే వలీయల్లాహ్ (అల్లాహ్ ఇష్టుల)ను వేడుకునే విషయమై ఎలాంటి ఆదేశం ఉంది?
జవాబు: వారిని వేడుకోవడం షిర్క్ అవుతుంది. అలాంటి వారు నరకానికి వెళ్తారు.
ఖుర్‌ఆన్: నీవు అల్లాహ్‌తోపాటు మరొక దేవుణ్ణి ఎవడినీ వేడుకోకు. అలా చేస్తే నీవు కూడా శిక్షింపబడేవారిలో చేరిపోతావు.
(అష్ షుఅరా: 213)
హదీస్: అల్లాహ్ తప్ప ఇతరులను వేడుకుంటూ ఉన్న స్థితిలో మరణించిన వ్యక్తి నరకంలో ప్రవేశిస్తాడు. (బుఖారీ)
ప్రశ్న: వేడుకోవడం (దుఆ) కూడా ఆరాధన అవుతుందా?
జవాబు: అవును, వేడుకోవడం కూడా ఆరాధనే అవుతుంది.
ఖుర్‌ఆన్: మీ ప్రభువు ఇలా అంటున్నాడు; "నన్ను వేడుకోండి, నేను మీ ప్రార్థనను స్వీకరిస్తాను". (గాఫిర్: 60)
హదీస్: 'దుఆ'యే ఆరాధన. (తిర్మిజీ)

అజీజుర్రహ్మాన్

కార్యక్రమాలలో కొత్తదనం

మానవుడు శ్రమ జీవి –

రెక్కాడితేనేగాని డొక్కాడదు. తెల్లవారు లేచింది మొదలు రాత్రి పడకపై చేరే వరకూ జీవన పోరాటం సాగిస్తూ ఉంటాడు. ఆశల ఆరాటంలో పరుగులు తీస్తుంటాడు. అలసిపోతుంటాడు. చిరాకు చెందుతూ ఉంటాడు. చిర్రెత్తిపోతూ ఉంటాడు. దీనంతటికి కారణం; అతని దిన చర్యలో ఓ కొత్తదనం, ఓ సరైన విరామం కొరవడటమే. తాజాదనాన్ని, నూతన ఉత్తేజాన్ని ఇచ్చే టైం టేబుల్ లేకపోవటమే.

అందుకే జీవితంలో మానవుడు ఓ కొత్తదనాన్ని కోరుకుంటూ ఉంటాడు. తన మనోమస్తిష్కాలకు తృప్తినీ, హాయినీ ఇచ్చే విరామాన్ని, ఆహ్లాదాన్ని కాంక్షిస్తాడు. ఒకే పనిని నిరంతరం చేస్తూ ఉండటం వల్ల విసుగు పుడుతుంది. అందుకే దేవుడు 'రేయింబవళ్ళ వ్యవస్థ'ను ఉంచాడు. రాత్రిని విశ్రాంతి సమయంగా చేసి, పగటిని పరిశ్రమ సమయంగా ఖరారు చేశాడు.

అయితే కార్యకలాపాల మధ్య మధ్యలో కూడా షార్ట్ బ్రేకులు పెట్టి, మనిషిలో కొత్త ఊపిరిని పోయాలని సృష్టికర్త తలపోశాడు. అందుకే అనుదినం ఐదు పూటల నమాజును ప్రవేశపెట్టాడు. తెల్లవారు జామున ఒల్లు విరుచుకుంటూ, ఆవులిస్తూ లేచిన మనిషి ఆత్మకు బలాన్నిచ్చే టానిక్కు అవసరం. 15 నిమిషాలు ఫజ్ర్ నమాజుతో అతని బద్ధకం కాస్తా దూరమవుతుంది. ఈ రోజు తాను తన సృష్టికర్తను ప్రార్థించి దైనందిన కార్యక్రమాన్ని మొదలెట్టానన్న భావన అతనికి కొండంత బలాన్నిస్తుంది. మధ్యాహ్నం వరకూ కష్ట పడి పని చేస్తాడు. ఒళ్లంతా హూనమైపోతుంది. మెదడు కూడా మందగిస్తుంది. ఇప్పుడితనికి విశ్రాంతి అవసరం. అవసరాలు తీర్చుకోవాలి. చన్నీళ్ళతో చక్కగా వుజూ చేసుకోవాలి. దైవ సన్నిధిలో హాజరై జుహ్ర్ నమాజు చేయాలి. వీలైతే కొన్ని నిమిషాలు మేను వాల్చాలి. బడలిక తీర్చుకోవాలి. దాంతో మళ్ళీ శక్తిని పుంజుకుంటాడు. మళ్ళీ పనులు మొదలు. అస్ర్ వేళలో మరో చిన్న విరామం. అలాగే సూర్యాస్తమయంలో ఇంకొక (మగ్రిబ్) విరామం. ఆ తర్వాత ఇషా నమాజుతో అతని దినచర్య ఓ కొలిక్కి వస్తుంది. ఈ విధంగా ఒక సుదీర్ఘ వ్యాపకాన్ని నమాజ్ అనే ఐదు ఆధ్యాత్మిక ఇంటర్వల్‌లతో మనిషి విజయవంతంగా పూర్తి చేస్తాడు. తద్వారా దేహశుద్ధితోపాటు ఆత్మ శుద్ధిని కూడా పొందుతాడు. అలసట అనేది అతని దరికి చేరదు. విరామాల సందర్భంగా సాటి మనుషులు వేసిన కుశల పశ్నలు కూడా అతన్ని ఉత్తేజితుణ్ణి చేస్తాయి. ఇక పరమ ప్రభువుతో జరిపిన సంభాషణ వల్ల అతని ఆత్మకు లభించిన శక్తి చెప్పనలవి కానిది. ఆ విధంగా రాత్రి కుదుట పడిన మనసుతో ప్రశాంతంగా నిద్రపోతాడు.

ఈ టైం టేబుల్‌ని ఎల్లప్పుడూ పాటించే వారికి కలిగే శుభాలు అన్నీ ఇన్నీ కావు. అందుకే దివ్యఖుర్‌ఆన్ ప్రవక్త ప్రియ సహచరుల (రజి)లోని ఈ మంచి అలవాటును ప్రశంసిస్తూ ఇలా చెప్పింది: "వారు తమ నమాజుల(అలవాటు)పై నిత్యం కొనసాగుతారు".
(70: 23)


నా వాడు అజీజుర్రహ్మాన్

- ముహమ్మద్ ఖాన్ (గన్నవరం)

(కువైట్‌లో 'నెలవంక' సంపాదకత్వ బాధ్యతలను విరమించుకుని స్వదేశానికి తిరిగి వస్తున్న తమ్ముడు అజీజుర్రహ్మాన్, వ్యక్తిత్వాన్ని సగర్వంగా గౌరవిస్తూ...)

అతను
నాకన్నా చిన్నవాడే అయినా
అన్నింటిలో నాకన్నా ఎంతో పెద్దవాడు
ఎంతో ఎత్తుకు ఎదిగిన గొప్పవాడు

మాటను
కాలమనే నికషోపలంపై పరికించి
బంగారంలా తూచి మరీ పలుకుతాడు



మనస్సాక్షిగా చెప్పాలంటే
అతని పాద ముద్రల్లో
అడుగేస్తూనైనా నేను నడవలేను

అతను, తెరిచిన మహా గ్రంథం
ఒక విధంగా చెప్పాలంటే
అతని కళ్ళల్లో సూటిగా చూచే ధైర్యం మాకు లేదు

అహింస ఆయుధముగా
సత్యం పరమావధిగా
క్రమశిక్షణకు వారసునిగా
అతని భుజకీర్తులు ప్రకాశిస్తూ ఉంటాయి

తనంటే
నాకే కాదు, మా బంధు సముదాయము అందర్కీ
అనిర్వచనీయమైన అలజడి లోలోన
పెల్లుబుకుతూ, చూపులు వాలిపోతాయి
జడ్జీ ఎదుట నిలబడ్డ ముద్దాయిల్లా
ఒకరి ముఖం మరొకరు చూసుకోవడం మినహా
నోట మాట ఎంత ప్రయత్నించినా రానేరాదు

తను గీచిన గీత
ఎలాంటి ఉపద్రవం ఎదురైనా, దాటనే దాటడు
అతనితో గడిపినంత సేపు
మనం, నందనవనంలో గడిపినట్లే ఉంటుంది, గాని
ఏదో తెలియని గరుకుదనం, లోలోన బెరుకుగా బాధిస్తుంది.
క్రమశిక్షణకు అర్థం అద్దం
బహుశ: అతనేనేమో

అతను తండ్రి ఎదుట, అబద్ధంగాని
అబద్ధం లాంటి నిజాన్ని దాచి
జీవిత ప్రారంభ దశలోనే
మొట్టమొదట తప్పు తప్పుకాని తప్పుకై
ఆత్మశుద్ధి చేసుకుని, కట్టుబట్టలతో
మనస్సాక్షి హెచ్చరికను శిరసావహించి
ఒట్టి చేతులతో న్యాయం, ధర్మాన్ని నమ్ముకుని
విశాల విశ్వంలో లీనమయిన అభిమానధనుడితడే!

ఇంతటి మహనీయుడు
నా మేనమామ కుమారుడగుట, నాకు గౌరవం కాదా?
స్వయంకృషికి నిర్వచనం తనేనేమో
మట్టిలో మాణిక్యం
నా వాడు, అజీజుర్రహ్మాన్
అతన్ని అందుకోవడం నా వల్ల కాదుగాని, ఇన్షాఅల్లాహ్
అతని పాద ముద్రల్లో
నడిచే ప్రయత్నం మాత్రం చేస్తానని
సవినయంగా మనవి చేస్తున్నా!

అదిగో, అల్లంత దూరాన
అతని ఛాయ ఇటుగా నడుస్తూ ఉంది.
నా వాచ్‌లో
కాలాన్ని సరిదిద్దుకుంటూ నేను.....

మూలం:
షేఖ్ అబూ బకర్ నజ్జార్

ప్రవక్త అయ్యూబ్ - 2

(అలైహిస్సలాం)

సహనశీలికి ఎదురైన పరీక్షలు

నాలుగవ పరీక్ష

ఇబ్లీసు అయ్యూబ్ ప్రవక్త భార్య వద్దకు వెళ్ళాడు. ఒక మనిషి రూపంలో ఆమె వద్దకు వెళ్ళి, "మీ భర్త ఎక్కడ ఉన్నారు?" అని ప్రశ్నించాడు. ఆమె తన వేలితో మంచంపై జీవచ్ఛవం మాదిరిగా పడి ఉన్న తన భర్తను చూపిస్తూ "అక్కడ ఉన్నారు. చూడండి, చావు బ్రతుకుల మధ్య ఉన్నారు" అని జవాబిచ్చింది. ఇబ్లీసు ఆమె పట్ల సానుభూతి చూపిస్తున్నట్లు నటిస్తూ, ఆమె భర్తతో గడిపిన మంచి రోజులను గుర్తు చేశాడు. అయ్యూబ్ (అ) ఆరోగ్యంగా ఉన్నప్పుడు, వారి వద్ద పుష్కలంగా సంపద, సంతానం ఉన్నప్పటి రోజులను గుర్తు చేశాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ప్రస్తుతం అనుభవిస్తున్న కష్టాలను తలచుకుని ఆమె రోదించింది. దుఃఖంతో అయ్యూబ్ (అ) వద్దకు వెళ్ళి, "మన ప్రభువు విధిస్తున్న ఈ కష్టాలను ఎంత కాలం భరిస్తాం? మనం ఇలాగే సంపద, సంతానం, మిత్రులు ఎవరూ లేకుండా గడుపవలసిందేనా? ఈ కష్టాలను తొలగించాలని మీరు అల్లాహ్‌ను ఎందుకు ప్రార్థించడం లేదు?" అనడిగింది.

అయ్యూబ్ (అ) నిట్టూర్పుతూ... బలహీన స్వరంతో జవాబిచ్చారు: "ఇబ్లీసు నీలో ఇలాంటి భావాలు రేకెత్తించి ఉంటాడు. అందువల్లనే నీవు అసంతృప్తికి గురయ్యావు. ఒక విషయం చెప్పు, ఎంత కాలం నేను ఆరోగ్యం, సంపదలను అనుభవించాను?" అని ప్రశ్నించారు. ఆమె జవాబిస్తూ "ఎనభై సంవత్సరాలు" అంది. మళ్ళీ అయ్యూబ్ (అ) ఆమెను ప్రశ్నిస్తూ, "మనం ఎంత కాలంగా కష్టాలను అనుభవిస్తున్నాం?" అనడిగారు. ఆమె జవాబిస్తూ, "ఏడేళ్ళుగా" అని అంది. అప్పుడు అయ్యూబ్ (అ) ఆమెకు జవాబిస్తూ, అయితే ఈ కష్టాలను తొలగించాలని అప్పుడే నా ప్రభువును కోరడం నాకు సిగ్గుచేటు. ఎందుకంటే నేను ఆరోగ్యం, ఐశ్వర్యాలు అనుభవించినంత కాలం కష్టాలు అనుభవించలేదు. నీ విశ్వాసం బలహీనమైనట్లుంది. నువ్వు అల్లాహ్ సంకల్పం పట్ల అసంతృప్తికి గురయ్యావు. నాకు మళ్ళీ ఆరోగ్యం చేకూరితే, నిన్ను వంద దెబ్బలతో శిక్షిస్తాను. ఈ రోజు నుంచి నీ చేతి ఆహారం కాని, పానీయం కాని తీసుకోనని ప్రమాణం చేస్తున్నాను. నన్ను నా మానాన వదిలేయ్. నా ప్రభువు అభీష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది" అన్నారు. ఆమె హృదయ విదారకంగా దుఃఖిస్తూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఆమెకి ఇక వెళ్ళక తప్ప లేదు. వేరెక్కడయినా ఆశ్రయం వెదుక్కోక తప్పలేదు.

తొలిగిన కష్టాలు

ఈ నిస్సహాయ స్థితిలో అయ్యూబ్ (అ) దేవుని ప్రార్థనల్లో గడిపారు. దైవ కారుణ్యం కోసం వేడుకున్నారు. అంతే కాని ఎలాంటి ఫిర్యాదులూ చేయలేదు. "ప్రభూ! నేను ఈ వ్యాధితో చాలా కాలంగా భాధపడుతున్నాను. నీవు పరమ కరుణామయుడివి" అని ప్రార్థిస్తూ గడిపారు. అల్లాహ్ ఆయన ప్రార్థనలకు ప్రతిస్పందించాడు. ఆయనకు జవాబిస్తూ, "నీ కాలితో నేలను కొట్టు. అక్కడి నుంచి నీటి ఊట ఉబికి వస్తుంది. ఆ నీటిని త్రాగి, దానితో స్నానం చేయ్" అని అల్లాహ్ సూచించాడు. అయ్యూబ్ (అ) అలాగే చేశారు. ఆ వెంటనే ఆయన ఆరోగ్యం కుదుట పడింది.

ఈలోగా అయ్యూబ్ ప్రవక్త భార్య తన భర్తను వదలి ఎక్కువ రోజులు ఉండలేక పోయారు. ఆయన వద్దకు క్షమాపణ కోరుకోవడానికి వచ్చారు. ఆయన సేవలో గడుపటానికి వచ్చారు. కాని ఇంటిలోకి వచ్చి అక్కడి మార్పును చూసి ఆమె ఆశ్చర్యపోయారు. అయ్యూబ్ (అ) పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు. ఆమె ఆశ్చర్యంతో, ఆనందంతో ఆయన్ను కౌగిలించుకుని, అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెల్లించింది.

ప్రతిజ్ఞ

ఇప్పుడు అయ్యూబ్ (అ) మరింత ఆందోళనకు గురయ్యారు. తనకు ఆరోగ్యం చేకూరితే తన భార్యను వంద దెబ్బలతో శిక్షిస్తానని ప్రమాణం చేసి ఉన్నారు. కాని ఆమెను బాధించే ఉద్దేశ్యం ఆయనకు ఎంతమాత్రం లేదు.

కాని తన ప్రమాణం ప్రకారం చేయకపోతే దేవునిపై చేసిన ప్రమాణం భంగపరచిన వారవు తారు. ఈ సంకటాన్ని స్వయంగా అల్లాహ్ తొలగిం చాడు.అల్లాహ్ ఆయనకు సలహా ఇచ్చాడు: "వంద గడ్డిపోచలు కలిపి ఒక కట్టగా చేయ్... నీ భార్య శరీరానికి ఆ కట్టను ఒకసారి తాకించు. ఆ విధంగా నీ బాధ్యత పూర్తవుతుంది. కష్టకాలంలో నీ వెంట ఉన్న నిజాయితీ కలిగిన నీ భార్య పట్ల సానుభూతి, దయలను ప్రదర్శించినట్లవుతుంది" అన్న సలహాను ఆయన అమలు చేశారు..

గ్రహించవలసిన పాఠాలు

- ప్రవక్తలకు కూడా పరీక్షలు, కష్టాలు తప్పవు. మనిషిని అతని విశ్వాస స్థాయికి అనుగుణంగా పరీక్షించడం జరుగుతుందని అంటారు. మనిషి బలమైన విశ్వాసం కలిగిన వాడైతే కఠినమైన పరీక్షలకు గురిచేయడం జరుగుతుంది. ఈ విధంగా అల్లాహ్ మనిషి విశ్వాసాన్ని పరీక్షిస్తాడు. ఈ పరీక్షలో సహనం వహించినవారికి తన కారుణ్యంతో ప్రతిఫలం ప్రసాదిస్తాడు. అల్లాహ్ ఈ విధంగానే అయ్యూబ్ ప్రవక్తను పరీక్షించాడు. ఆయన సహనానికి మారు పేరుగా నిలిచారు. అయ్యూబ్ (అ) వంటి సహనం కలిగిన వ్యక్తిగా ఎవరినైనా ప్రశంసించడమంటే భావం అత్యంత ఉత్తమ స్థాయి సహనం కలిగినవాడని చెప్పడమే.
- సబ్ర్ (సహనం) గురించి డెబ్భయిసార్ల కన్నా అధికంగా దివ్యఖుర్ఆన్ ప్రస్తావిం చింది. మిగిలిన సుద్గుణాలకన్నా సహనాన్ని అల్లాహ్ అధికంగా ప్రశంసించాడు.
- భార్యతో ఎలా వ్యవహరించాలన్నది అయ్యూబ్ ప్రవక్త ఆచరణల్లో తెలుస్తుంది. అయ్యూబ్ ప్రవక్త కష్టాల్లో ఉన్నప్పుడు ఇబ్లీసు ఆయన భార్యను ప్రలో భానికి గురిచేశాడు. అందువల్ల ఆయన తన భార్యను శిక్షిస్తానని ప్రమాణపూర్వకంగా చెప్పారు. కాని ఆమె ఆయన పట్ల చాలా విశ్వాసంగా ఉన్న మహిళ. అందువల్ల ఆమె పట్ల ఉదారంగా వ్యవ హరించవలసి ఉంది. ఈ సమస్యను పరిష్కరించ డానికి అల్లాహ్ ఒక చక్కని మార్గాన్ని ఆయనకు చూపించాడు.
- వంద గడ్డిపోచల కట్టతో భార్యను తాకాలని చూపించిన పద్ధతి నిజానికి అల్లాహ్ నేర్పిన పాఠం. మాటలకు, వాస్తవాలకు మధ్య ఉన్న అంతరాన్ని గుర్తించవలసిన అవసరాన్ని ఈ పద్ధతి తెలుపుతుంది. బహిరంగంగా విధించే సాధారణమైన శిక్ష కూడా మనిషికి సరిపోతుంది.
- అనాలోచితంగా ప్రమాణాలు చేయరాదని దివ్య ఖుర్ఆన్ బోధిస్తుంది.

సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ

చిరపరిచితుడయ్యాడు చిత్రంగా!

తెలుగంటే తేనియలని తెలియని నాకు
తెలుగు మధురిమల్ని తెలియపరిచినవాడు
జీవితంలోని సుఖాల తీపినీ దుఃఖాల చేదునీ
కలిపి ఎలా అనుభవించాలో నేర్పినవాడు
అతనో అపరిచితుడే నిన్నటి వరకు
చిరపరిచితుడై నిలిచాడు చిత్రంగా చూడు!

షరా మామూలుగా చేసుకునే ముఆనఖాలు
మనసు మసిని కడిగే ప్రేమాంకురాలవ్వాలన్నవాడు
మేలిమి వ్యక్తిత్వం ఉబికి రావాలి కొలిమి
నిప్పుల్లోంచి శిరసెత్తిన సెగలా అన్నవాడు
అతనో సామాన్యుడే స్వాభిమానధనుడే నిన్నటి వరకు
హితుడై మాట మహితుడై నిలిచాడు చిత్రంగా చూడు!

వేదికలెక్కి చిలకరించే ఒట్టి మాటల
తుంపర్లకు లక్ష్యాల వృక్షాలు మొలకెత్తవన్నవాడు
ఎప్పుడూ నమ్మొద్దు మునాఫిక్ మనస్కుల మాటలను
నీడలా ఉంటూనే వెన్ను పోటు పొడుస్తారన్నవాడు

అతనో ఉక్తి, అభివ్యక్తి, శక్తి గల వక్తయే నిన్నటి వరకు
ఖుర్ఆన్ అనువాదకునిగా చిరస్మరణీయుడై నిలిచాడు చిత్రంగా చూడు!

తను నా తప్పులు దిద్దుతున్నప్పుడు
మహా శిల్పి నన్ను మలుస్తున్నట్లన్పించేది
నక్షత్రాలు నా భుజం తట్టి అంటుంటాయి
నీ ప్రతిభంతా అతని ఆనవాళ్లేనని!

ఓ సారి అతని పటం గీయాలనుకున్నాను
అప్పుడు స్ఫురించింది నాకు నే చిత్రకారుణ్ణి
కానని, పదచిత్రణ మాత్ర జీవినని
కలవరపరిచింది నన్ను ఓ వింత ప్రశ్న

కలం కుంచె కాగలదా అని
పదాలు రేఖలుగా మారగలవా అని
భావాలు రంగులు అవుతాయా అని
క్షణంలో కవినన్న అహం అణగారింది
కరిగే మంచు పర్వత శిఖరంలా

పోగులుగా విడిపోతున్న స్మృతి చిత్రాల్ని
మరుక్షణమే మనో క్షేత్రంలో పొదుగుకుని
అతని రూప ఛాయల్ని నిలుపుకున్నాను అతను నా
గురువన్న మాటను పదిలపర్చుకున్నాను చిరపదంగా

ఆసిమా బ్రాంచ్ ఆధ్వర్యంలో పిక్‌నిక్

ఐపిసి ఆసిమా బ్రాంచ్ తెలుగు సెక్షన్ ఆధ్వర్యంలో న్యూ ముస్లింలు 17 - 12 - 2010 వ తేదీ శుక్రవారం నాడు పిక్‌నిక్‌కు వెళ్ళారు. ఈ సందర్భంగా వారు ఆహ్లాదకరమైన వాతావరణంలో జూపార్క్‌ను సందర్శించి ఆనందించారు. మౌలానా సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ విహార యాత్ర ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించగా, శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారు 'కలిమయె తయ్యిబా' మన నుండి కోరేదేమిటో విశదీకరించారు. కె. అబ్దుల్లాహ్, ముబారక్ బాషా గేయాలను ఆలాపించారు. అనంతరం అందరూ విందారగించి వెళ్ళారు.





ఆసిమా బ్రాంచ్ ఆధ్వర్యంలో

ఐపిసి ఆసిమా బ్రాంచ్ తెలుగు సెక్షన్ ఆధ్వర్యంలో..... అక్టోబర్‌లో విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయ బడ్డాయి. ఈ సందర్భంగా భారత దేశం నుంచి విచ్చేసిన ముఖ్య అతిథి మౌలానా అక్బర్ అలీ రషాదీ గారు విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ - "విశ్వసించిన తర్వాత ఆ విశ్వాస సంరక్షణ కోసం పాటు పడుతూ, అవసరమైతే ఇల్లూ వాకిలిని వదలాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది" అన్నారు. అలాగే ఇస్లాం స్వీకరించిన తర్వాత ముస్లిం సమాజంలో మమేకం అయి పోవాలని, ఇస్లాంను తన వరకే పరిమితం చేసుకోకుండా తల్లిదండ్రులు, బంధుమిత్రులకు చేరవేయాలని కోరారు.








అజీజుర్రహ్మాన్, డా. గాజీల వీడ్కోలు సభ

నెలవంక సంపాదకులు శ్రీ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్, ఫీమా మాజీ అధ్యక్షులు డా. అహ్మద్ గాజీ కువైట్ నుంచి తమ సేవలను విరమించుకుని స్వదేశానికి తిరిగి వెళుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని "ఇండో - కువైట్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్" ఆధ్వర్యంలో 19 - 12 -2010 వ తేదీ ఆదివారం రాత్రి స్థానిక ఇస్లాహి సెంటర్‌లో వీడ్కోలు సభ జరిగింది.

ఆఖరిలో అతిథేయులు జనాబ్ ముహమ్మద్ హోష్‌దార్ ఖాన్ ఆహూతులందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ఈ సభ ఉద్దేశాన్ని విశదీకరించారు. వక్తలు తమ గురించి వెలిబుచ్చిన మనోభావాలకుగాను డా. గాజీ సాబ్, అజీజుర్రహ్మాన్‌లు నిండు హృదయంతో కృతజ్ఞతలు తెలిపారు. ఖారీ ఇర్ఫాన్ అహ్మద్ గారి ఖుర్‌ఆన్ పారాయణంతో మొదలైన ఈ సభకు మౌలానా ఖాలిద్ ఆజ్మి కన్వీనర్‌గా వ్యవహరించారు.








టి ఎం ఎ వారి సత్కార సమావేశం

ఫీమా మాజీ అధ్యక్షులు డా. అహ్మద్ గాజీ కువైట్‌లో తన 18 ఏండ్ల వైద్య సేవలను ముగించుకుని భారత దేశానికి తిరిగి వెళుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ (కువైట్ శాఖ - టిఎంఎ) 16- 12-10వ తేదీన గురువారం రాత్రి మాలియాలోని మర్‌జాఖుల్ బద్ర్ మస్జిద్‌లో సన్మానించింది. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు జనాబ్ ముహమ్మద్ హనీఫ్ ఆయనగారి సేవలను శ్లాఘించగా, జనాబ్ ముహమ్మద్ అజీజుర్రహ్మాన్ గారు ఆయనలోని సద్గుణాలను స్మరించి ఆయన కొరకు దుఆ చేశారు. అనంతరం సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ నేమతుల్లాహ్ డాక్టర్ సాబ్‌కు 'జ్ఞాపిక'ను ప్రదానం చేశారు. తదనంతరం కడప సొసైటీతో15 ఏండ్లుగా తనకున్న అనుబంధాన్ని గుర్తు చేస్తూ డా. గాజీ సొసైటీ కార్యకర్త లందరినీ దీవించారు.




సయ్యద్ అబ్దుస్సలాం ఉమీ
abdussalamsyed@ymail.com



షిర్క్ పుట్టు పూర్వోత్తరాలు -7

అయితే "విశ్వాసులతోపాటు వారి సతానం కూడా విశ్వాసం (విషయం)లో వారి అడుగుజాడల్లోనే నడుచుకొని ఉంటే, అలాంటి సంతానాన్ని కూడా మేము (స్వర్గంలో) వారి దగ్గరికి చేర్చుతాము. వారి సుకృత ఫలాన్ని మేము ఏ మాత్రం తగ్గించము. ప్రతి మనిషి తన కర్మలకు తాకట్టుగా ఉంటాడు".

(దివ్య ఖుర్ఆన్- 52: 21)

కనుక ఇబ్రాహీమ్ (అ) వేడుకున్నట్లు మనం కూడా దైవాన్ని వేడుకుందాం: "నా ప్రభువు తప్పకుమడా (నా) మొరాలకిస్తాడు. ప్రభూ! నన్ను ప్రార్థన వ్యవస్థ నెలకొల్పేవానిగా చెయ్యి. నా సంతానాన్ని కూడా. ప్రభూ! నా విజ్ఞప్తి స్వీకరించు. నా తల్లి దండ్రుల్ని, యావత్తు విశ్వాసుల్ని కర్మ విచారణ రోజు క్షమించు".

(దివ్య ఖుర్ఆన్- 14: 40,41)

కుమార్తె పుట్టిందా! అయితే ఇలా మొరపెట్టుకోండి: "ఈమెను, ఈమె సంతానాన్ని శాపగ్రస్తుడైన షైతాన్ బారిన పడకుండా నీ రక్షణలో ఇస్తున్నాను ప్రభూ!"

(దివ్య ఖుర్ఆన్- 3: 36)

ఇలా ప్రార్థేయపడండి: "ప్రభూ! నీవు నాకు, నా తల్లిదండ్రులకు చేసిన మేళ్లకుగాను నేను నీ పట్ల కృతజ్ఞుడనై ఉండే సద్బుద్ధిని ప్రసాదించు. నీ ప్రసన్నతా భాగ్యం లభించేటటువంటి సత్కార్యాలు చేసే సద్బుద్ధిని కూడా ప్రసాదించు. నా సంతానాన్ని కూడా సజ్జనులుగా చేసి నాకు సుఖాన్నివ్వు".

(దివ్య ఖుర్ఆన్- 46: 15)

రండి, ఈ పుణ్యాత్ముల వర్గంలో మనం కూడా చేరిపోదాం! వారు (దైవ సన్నిధిలో చేతులు చాచి) "ప్రభూ! మా భార్యాపిల్లల ద్వారా మా కంటికి చలువ ప్రసాదించు. మేము దైవభీతిపరులకు నాయకులయ్యేలా మమ్మల్ని ఆశీర్వదించు" అని ప్రార్థిస్తారు.

(దివ్య ఖుర్ఆన్- 25: 74)

వీరి గురించి ఇంకా దేవుడేమంటున్నాడో చూడండి: "వారిలో ప్రతి ఒక్కరికి ప్రపంచ మానవులందరిలోకెల్లా ఎక్కువ గౌరవం, ఔన్నత్యాలను ప్రసాదించాము. అంతేకాదు, వారి తాత ముత్తాతలు, సంతానం, సోదరులలో కూడా చాలా మందికి మేము (ఎంతగానో) అనుగ్రహించాము. వారికి ప్రత్యేకంగా మా సేవ కోసం ఎన్నుకొని సన్మార్గం వైపు నడిపించాం".

(దివ్య ఖుర్ఆన్- 6: 86, 87)

వీరి కోసం దైవ దూతలు సయితం ప్రార్థిస్తుంటారు: "విశ్వ ప్రభువు సింహాసనాన్ని (అర్ష్‌ను) ఎత్తి పట్టుకున్న దైవ దూతలు, దాని చుట్టూ నిలబడిన దైవ దూతలు అంతా కలిసి తమ ప్రభువు ఔన్నత్యాన్ని కీర్తిస్తూ, ఆయన పవిత్రతను స్మరిస్తున్నారు. వారు ఆయన్ని (సదృఢంగా) విశ్వసిస్తున్నారు. విశ్వసించిన వారిని క్షమించమని ఇలా ప్రార్థిస్తారు: 'ప్రభూ! నీవు నీ కారుణ్యంతో, నీ జ్ఞాన సంపత్తితో ప్రతి వస్తువునూ పరివేష్టించి ఉన్నావు. కనుక పశ్చాత్తాపం చెంది నీ మార్గం అవలంబించేవ వారిని క్షమించు. వారిని నరక యాతనల నుండి కాపాడు. ప్రభూ! నీవు వారికి వాగ్దానం చేసిన శాశ్వత స్వర్గ వనాలలో వారిని ప్రవేశింపజేయి. వారి తల్లిదండ్రులలో, భార్యాపిల్లల్లో సజ్జనులైనవారిని కూడా (స్వర్గ వనాలలో వారితోపాటు చేర్చు). నిజంగా నీవు అద్వితీయ శక్తిసంపన్నుడవు, అద్భుత వివేక వంతుడవు. వారిని ఆపదలు, అనర్థాల నుండి రక్షించు స్వామి!"

(దివ్య ఖుర్ఆన్- 40: 7-9)



- అబుల్ తాసన్



నేటి బాలలే రేపటి పౌరులు - 9

ఆయన ఆ విగ్రహాలను తునాతునకలుగా విరగ్గొట్టాడు. తన్నుతాను రక్షించుకోలేని విగ్రహాలు దైవం కాజాలవు అని ప్రజలు గ్రహించాలన్న సదుద్దేశ్యంతోనే ఆయన అలా చేశారు. గుణపాఠం నేర్చుకోవ డానికి బదులు ఆయన జాతి ప్రజలు మండి పడ్డారు. మీరేదైనా చేయాలను కుంటే ఇతణ్ణి కాల్చివేయండి. మీ దేవతల ను (రాళ్ళు - రప్పలను) కాపాడుకోండి అన్నారు. చుట్టుప్రక్క గ్రామాల్లోని విగ్రహా రాధకులంతా తమ వంతు కట్టెలు ప్రోగు చేశారు. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గారి కోసం ఓ పెద్ద అగ్ని గుండం తయారు చేయబడింది. ఆ తర్వాత వేలాది మంది పల్లెవాసులు, పట్టణవాసుల సమక్షంలో ఆయన్ను తాళ్ళతో బంధించి ఆ అగ్ని గుండంలో విసిరేశారు.

మధ్యలో ఓ కుర్రాడు - అయ్యో...!.పాపం...!! అన్నాడు. మరో అబ్బాయి - అగ్ని ఆయన్ను కాల్చేసిందా ...!? ఇంకో అబ్బాయి - 'క్యా హమారె ప్యారె అల్లాహ్ ఉన్హే నహీ బచాయే...!!?' అసలు ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పండి అంటూ ప్రతి ఒక్కరూ ఆయన గారి పట్ల తమకున్న సానుభూతిని కన బర్చారు.

వారు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ)కు కీడు చేయజూశారు. అయితే అల్లాహ్ వారి దుష్ట యత్నాన్ని తిప్పి కొట్టాడు. "అగ్ని! ఇబ్రాహీమ్ (అ) కోసం శాంతించు, చల్లబడిపో" అని ఆదేశించాడు. కొండల మీద, గుట్టల మీద, మిట్టపల్లాల్లో నిలబడి చూసే ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. అగ్ని ఆయన్ను కట్టి పడేసిన త్రాళ్ళను, చుట్టూ ఉన్న కట్టెల్ని తింటూ ఉంది కానీ, ఆయనకు ఎలాంటి హాని కలిగించలేదు. ఆయన అగ్ని గుండం గుండా సురక్షి తంగా బైటపడ్డారు. అయితే ఆయన కోసం మరో పరీక్ష కాచుకొని ఉంది. ఆ పొంచి ఉన్న ప్రమాదమే 'బాబిలోనియా' - ఇరాక్ దేశపు రాజు నమ్రూద్.

అతనే నమ్రూద్. 'నేనే దైవాన్ని' అని అతను చెప్పుకునేవాడు. ప్రజలు సయితం అతన్ని దైవంగా భావించి వంగి వొంగి దణ్ణాలు పెట్టేవారు. అతను ఎంతో గర్విష్టి, దుర్మార్గుడు. ఆ రాజు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గారి సత్య ధర్మ ప్రచారం వల్ల తన రాజరికానికి ముప్పుందని గ్రహించి హజ్రత్ ఇబ్రాహీమ్ గారిని తన దర్బారులో హాజరు పర్చమని ఆదేశిం చాడు. అయినా హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) అదరలేదు, బెదరలేదు. నిర్భయంగా అతని వద్దకు వెళ్లారు. వారి మధ్య జరిగిన సంభాషణ ఏమిటో తెలుసా?

నమ్రూద్: ఎవరు నీ ప్రభువు?

ఇబ్రాహీమ్: ఎవరి అధీనంలో (ప్రతి ప్రాణి) జీవన్మరణాలున్నాయో ఆయనే నా ప్రభువు.

నమ్రూద్: చావుబ్రతుకులు నా అధీనంలో కూడా ఉన్నాయి అని ఓ నిర్దోషిని చంపే శాడు. మరో ఉరికంబాన్నెక్కబోయే దోషిని వదిలేశాడు.

ఇబ్రాహీమ్: అయితే (నీవే గనక దేవుడివి అయితే) అల్లాహ్ సూర్యుడ్ని తూర్పు నుండి ఉదయింపజేస్తున్నాడు కదా! నీవు దాన్ని కాస్త పడమర నుమచి ఉదయింప జెయ్యి చూద్దాం!!

నమ్రూద్: (నోరు మూసుకున్నాడు) తన బలహీనతను తెలుసుకున్నాడు. తను కేవలం ఓ దేశానికి రాజు మాత్రమేననీ, సర్వాన్ని పరిపాలించే శక్తి తనలో లేదని అతనికి అర్థమవుతూనే ఉంది. కాని తను రాజునన్న అహంకారం అతన్ని మరింత పాపకూపంలోకి నెట్టివేసింది. చివరకు ఓ కుంటి దోమ అతని మరణ శాసనం రచించింది. అప్పటి నుండి 'కుక్క కాటుకి చెప్పుదెబ్బ' అన్న సామెతకి బదులు 'దోమ కాటుకి చెప్పు దెబ్బ' అన్న నానుడి వ్యాప్తి చెందింది.

కొన్నాళ్ళకు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) ముందు సారా తర్వాత హాజిరా అనే ఇద్దరు స్త్రీలను మనువాడారు. అల్లాహ్ హాజిరా (అ) కడుపున పండంటి బిడ్డను ప్రసాదించాడు. ఆ పసికందునికి 'ఇస్మాయిల్' అని నామకరణం చేశారు. ఆయన పెరిగి పెద్దయ్యారు. అంటే మీ వయసుకి చేరుకున్నాక, ఆ బాలుడ్ని జిబహ్ చెయ్యమని హజ్రత్ ఇబ్రాహీమ్ గారికి కల చూపించాడు అల్లాహ్. హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) కన్న కొడుకుని జిబహ్ చెయ్యడానికి సిద్ధమయ్యారు. కాని, అల్లాహ్ బలిని కోరడు గనక, హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గారి త్యాగ నిరతిని మెచ్చుకుని "ఖలీలుల్లాహ్" (అల్లాహ్ అనుఁగు మిత్రుడు) అని బిరుదు ఇవ్వడంతోపాటు ఈ శుభ సంద ర్భాన్ని పురస్కరించుకొని పండగ జరుపు కొండని ఆకాశం నుండి ఓ పొట్టేలును దించాడు. ఈ సంప్రదాయాన్నే తరువాత వచ్చే ముస్లింలంతా పాటించాలని ఆదేశించాడు. దాన్నే మనం **'ఈదుల్ అజ్హా'** (త్యాగోత్సవం) అంటాము.

ఆ తర్వాత అల్లాహ్ ఇస్మాయిల్ (అ)ను తోడు తీసుకుని అల్లాహ్ ఆరాధన కోసం సర్వ మానవుల కొరకు 'కాబా షరీఫ్' (పవిత్ర గృహాన్ని) నిర్మించమని హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గారికి ఆజ్ఞాపించాడు. యువకులైన హజ్రత్ ఇస్మాయిల్ (అ) తన భుజస్కందాల మీద కొండ రాళ్ళను మోసుకొస్తుంటే, హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గారు దైవ గృహాన్ని నిర్మించారు.

కథ మధ్యలో... ఓ కుర్రాడు- ఏంటి సార్ మీరు మరీనూ, మధ్యలోని కథ సాంతం వదిలేశారు. మా అమ్మ నాకు హజ్రత్ ఇస్మాయిల్ (అ) గురించి ఎన్నో సార్లు చెప్పింది. ఆయన గాథ అంటే నాకు ప్రాణం... ఆ కథ కూడా చెప్పండి హజ్రత్..ప్లీజ్...ప్లీజ్... ప్లీజ్!!

సత్యం వచించు...

(5వ పేజీ మిగతా భాగం)

వివేకానందుని మాటకు, ఖుర్‌ఆన్ పిలుపునిస్తున్న ఈ బాటకు మధ్య ఎంతటి సారూప్యత ఉందో కాస్త గమనించండి. మానవాళిని ప్రాంతీయపరంగానూ, జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ సమైక్య పర్చేందుకు అది సూచించే ప్రార్థనా విధానం గురించి సునిశితంగా ఆలోచించండి. ఒక్కసారి విశ్వ మానవాళిని ఒకే ఒక్క క్షేత్రంలో సమైక్యపర్చే మహారాధన హజ్జ్ గురించి మనసు పెట్టి యోచించండి. ఇవన్నీ దేనికి తార్కాణాలో మీకే అర్థం అవుతుంది.

ఇక మనం అనవసర పాక్షికాంశాలపై నొక్కు పెట్టుకుని వైషమ్యాలు పెంచుకుని, విరోధాలు వృద్ధి చేసుకోవడం మానుకోవాలి. తగాదాలు, కొట్లాటలు, కలహాలు సంఘ విద్రోహ శక్తులకు, శాంతి విఘాతకులకు, స్వార్థపరులకు మాత్రమే ఉప యోగపడతాయి. సామాన్య ప్రజానీకం మాత్రం తీవ్ర నష్టానికి, కష్టానికి గురవుతుంది. కాని స్వార్థపరులు మారరు, జనాన్ని మారనివ్వరు. అంతేకాదు ప్రజల ఈ వేర్పాటు మనస్తత్వాన్ని ఆసరాగా చేసుకుని వారిని రాజకీయ జూదంలో పావులుగా వాడుకుంటారు. ఇది నాటి నుండి నేటి వరకు అగ్ర రాజ్యాలు మొదలు, సామాన్య దేశాల వరకు అన్నింటా కనిపిస్తున్న దృశ్యం. 'అవసరం అనిపిస్తే శాంతి, అవసరం తీరితే అలజడి' అన్న భావనే నేడు సర్వత్రా కనబడుతోంది. కాబట్టి పైన పేర్కొన్నవి (వంశం, భాష, జాతి, సంపద, మతం మొదలైనవి) మారుతుంటాయి. అస్తుబిస్తు అవుతుంటాయి. మనిషి మాత్రం మనిషిగానే ఉంటాడు. మనం పాక్షికమైన వాటినే పట్టుకు వ్రేలాడకుండా, మానవజాతిని సమైక్య పర్చే మౌలికాంశాలపై చూపు మళ్ళించాలి.

భూమ్యాకాశాల మధ్య లక్షల మైళ్ళ దూరం ఉన్నప్పటికీ ఈ రెండింటి మధ్య సమతూకం దైవాదేశం వల్లనే ఏర్పడింది. ఇవి దైవాజ్ఞ బద్ధులై, ఆయన నిర్దేశించిన పద్ధతి ప్రకారం ఎలాంటి అసంతులనం లేకుండా పరిభ్రమిస్తున్నాయి. ఇదే విధంగా మనుషులు కూడా దైవాదేశాలను తు.చ. తప్పక పాటిస్తే వారి మధ్య ఉన్న కలహాలు, ఘర్షణలు, వివాదాలు, సమసిపోతాయి. మనుష్యుల మధ్య సమైక్యత, సోదర భావం పరిఢవిల్లుతుంది. కనుక మనం సత్యాన్ని వచించాలి. ధర్మాన్ని పాటించాలి. అది తప్ప శాంతి తెచ్చి పెట్టే, మానవ జాతి ఏకత్వాన్ని సాధించే మరో సాయుధం లేదు. మరి లోకం, లోకవాసులమైన మనం ఈ మార్గాన్ని అనుసరించడానికి సిద్ధంగా ఉన్నామా?


రాష్ట్రానికి రానున్నవి గడ్డు రోజులేనా?

(7వ పేజీ మిగతా భాగం)

★ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండీ నేటి వరకు ఎన్నో ప్రాంతీయ ఉద్యమాలు, ఆందోళనలు పుట్టుకు వచ్చాయి. ప్లెబిసైట్ ధోరణులు కూడా ప్రబలినాయి. దక్షిణాదిన 'ద్రవిడ మున్నేట్ర కజగం' మాత్రం తక్కువ హంగామా చేసిందా? జమ్మూ - కశ్మీర్లో ప్రబలిన ప్లెబిసైట్ ధోరణులను మరచి పోయారా? ఈశాన్య రాష్ట్రాల్లో రగిలిన వేర్పాటు ధోరణిని అప్పుడే విస్మరించేశారా? "భారతీయులారా! ఇక్కణ్ణుంచి వెళ్ళిపోండి" అన్న రాతలు అస్సాం గోడలపై వెలిసిన సంగతి మరచిపోదామా? నాగాలాండ్‌లో పొడసూపిన భారత వ్యతిరేకతను ఉపేక్షించగలమా? పంజాబ్‌లో ఖాలిస్తాన్ వాదులు ప్రత్యేక రాష్ట్రాన్నే కాదు, ఏకంగా ప్రత్యేక రాజ్యాన్నే కోరిన సంగతిని అప్పుడే మరచి పోయారా? కాని చివరకు ఏమైంది!

కేంద్రం నిగ్రహం పాటించింది. సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించింది. కాని దేశ సమగ్రత విషయంలో మాత్రం ఎన్నడూ రాజీ పడలేదు. జాతీయ సమైక్యతకు గొడ్డలిపెట్టుగా పరిణమించే ఏ వాదానికీ ఒత్తాసు పలకలేదు. కాబట్టి మనం ఎప్పుడూ సమస్యను అన్ని కోణాల నుంచీ వీక్షించాలేగాని కేవలం రాజకీయ లబ్ధి కోసం ప్రాకులాడకూడదు.

★ నేడు ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు కష్టాల్లో ఉన్నారు. మన రాష్ట్రం వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రం. డిశంబర్‌లో వచ్చిన భారీ వర్షాల కారణంగా నోటి కాడికి వచ్చిన రైతు కూడు ఏటి పాలైంది. నేడు మన రైతాంగం రక్త కన్నీరు కారుస్తోంది. రాష్ట్ర పార్టీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు - అన్నీ కలిసి నిజాయితీగా రైతును ఆదుకునేందుకు యత్నించాలే గాని 'రాజకీయం' చేయకూడదు.



ధనార్జన ధ్యేయం

ధర్మసమ్మతంగా ధనాన్ని ఆర్జించటం శుభసూచకం, శుభప్రదమే కాకుండా మహా గొప్ప సత్కార్యం కూడాను. ధనార్జన ధర్మసమ్మతంగానే ఉన్నప్పటికీ ధ్యేయం కూడా అంతే ఉన్నతంగా ఉంటేనే అది ఫలాన్నిస్తుంది. అన్యథా 'డబ్బు భలే జబ్బు' అన్నట్టు అది ఘోర పాపంగా, మహా చెడ్డ దుష్కార్యంగా పరిణమించే ప్రమాదం ఉంది. దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు:

'ఇతరుల ముందు చేయి చాచి అర్థించే దుస్థితి రాకూడదని, తన భార్యాపిల్లల ఉపాధి, సుఖశాంతుల ఏర్పాటు కోసం, పారుగువారి పట్ల సత్ప్రవర్తన కలిగి ఉంటూ వారిని అవసరానికి ఆదుకోవాలన్న సదుద్దేశ్యంతో ధర్మసమ్మత మార్గాలనుసరించి ధనాన్ని సంపాదించే వ్యక్తి తన ముఖారవిందం పూర్ణ చంద్రునివలే దేదీప్యమానంగా

వెలిగిపోతున్న ఉత్తమ స్థితిలో ప్రళయ దినాన దైవాన్ని కలుసుకుంటాడు. మరెవరైతే ధర్మసమ్మతంగానే ధనం సంపాదించి ప్రజలు తనను కుబేరుడు అని పిలవాలని, తన గొప్పను ఇతరుల ముందు చాటుకోవాలన్న దురుద్దేశ్యంతో ఉంటాడో అలాంటి వ్యక్తి దేవుడు కోపంతో ప్రచండ నిప్పులు కురిపించే ఉగ్ర స్థితిలో ప్రళయదినాన హాజరు పర్చపడతాడు." (బైహఖీ)



న్యూ ముస్లిం శిక్షణా తరగతులు

ఫహాహీల్ బ్రాంచ్

శుక్రవారం: ఉదయం 9 నుండి 11 వరకు
ఆదివారం: సాయంత్రం 5 నుండి 7 వరకు
గురువులు: షేఖ్ హబీబుర్రహ్మాన్ జామయీ
Ipcblogger.net/habbu
Shaikhabeebjamai.blogspot.com

వఫా బ్రాంచ్

ప్రతి రోజు సాయంత్రం 5 నుండి 8 వరకు
గురువులు: షేఖ్ సలీమ్ ఉమ్రీ
http://ipcblogger.net/salimumri/

రౌదా స్త్రీల విభాగం

ఆదివారం: సాయంత్రం 5 నుండి 6:30 వరకు
ఆదివారం: సాయంత్రం 6:30 నుండి 8 వరకు
సోమవారం: సాయంత్రం 5 నుండి 6:30 వరకు
సోమవారం: సాయంత్రం 6:30 నుండి 8 వరకు
టీచర్: తాహెరా బేగం
http://ipcblogger.net/tahera/

సోమవారం: సాయంత్రం 5 నుండి 6:30 వరకు
సోమవారం: సాయంత్రం 6:30 నుండి 8 వరకు
టీచర్: రెహానా బేగం
http://ipcblogger.net/rehana/

2011

January

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30
31						

February

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28						

March

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29	30	31			

April

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
				1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	

May

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
						1
2	3	4	5	6	7	8
9	10	11	12	13	14	15
16	17	18	19	20	21	22
23	24	25	26	27	28	29
30	31					

June

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
		1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30			

July

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
				1	2	3
4	5	6	7	8	9	10
11	12	13	14	15	16	17
18	19	20	21	22	23	24
25	26	27	28	29	30	31

August

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
1	2	3	4	5	6	7
8	9	10	11	12	13	14
15	16	17	18	19	20	21
22	23	24	25	26	27	28
29	30	31				

September

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
			1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30		

October

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
					1	2
3	4	5	6	7	8	9
10	11	12	13	14	15	16
17	18	19	20	21	22	23
24	25	26	27	28	29	30
31						

November

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
	1	2	3	4	5	6
7	8	9	10	11	12	13
14	15	16	17	18	19	20
21	22	23	24	25	26	27
28	29	30				

December

MON	TUE	WED	THU	FRI	SAT	SUN
			1	2	3	4
5	6	7	8	9	10	11
12	13	14	15	16	17	18
19	20	21	22	23	24	25
26	27	28	29	30	31	